

ఇసుక కోసం తవ్వింది ఎంత?

- 18 చోట్ల తవ్వకాలపై విచారణ
- పరిశీలించి నివేదిక ఇవ్వాలన్న రాష్ట్ర ప్రభుత్వం
- రంగంలోకి మైనింగ్ అధికారులు

నెల్లూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వంలో జరిగిన ఇసుక అక్రమాలపై కూటమి ప్రభుత్వం విచారణకు పూనుకుంది. గతంలో పేదలు పడ్డ ఇబ్బందులు, దోచుకున్న ప్రజా సంపదను దృష్టిలో పెట్టుకొని తాజాగా విచారణకు ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడెక్కడ తవ్వకాలు జరిపారు? ఎంత మేర ఇసుకను తరలించుకువెళ్లారు? పర్యావరణపరంగా ఎటువంటి ఇబ్బందులు కలిగించారు? వంటి వివరాలను పరిశీలించి నివేదిక పంపాలని జిల్లా అధికారులను ఆదేశించింది. జిల్లాలో 18 ప్రాంతాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు జరిగినట్లు గుర్తించి, అన్నిచోట్ల క్షేత్రస్థాయి విచారణ జరపాలని జిల్లా అధికారులకు సూచించింది. గురువారం నుంచి మైనింగ్ అధికారులు ఆ పనిలో పడ్డారు. విచ్చలవిడిగా తవ్వకాలు జరిపిన ప్రదేశాల్లో సర్వే చేసి అక్రమాలు ఏ స్థాయిలో జరిగాయో నిగ్గు తేల్చనున్నారు.

ఇసుక అక్రమాలు నిజమే..!

జిల్లాలో ఇసుక అక్రమ తవ్వకాలు నిజమేనని ఈ ఏడాది ఫిబ్రవరిలోనే జిల్లా అధికారులు తేల్చారు. ఇసుక అక్రమ తవ్వకాలపై కొందరు జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్‌ను (ఎన్జీటీ) ఆశ్రయించారు. ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్రం మొత్తం ఒకే ఫార్మాట్‌లో ఇసుక అక్రమ తవ్వకాలు జరగలేని నివేదికలు ఇవ్వగా జిల్లా అధికారులు మాత్రం అక్రమ తవ్వకాలు నిలిపేశామని నివేదిక అందజేశారు. అంటే అప్పటి వరకూ అక్రమ తవ్వకాలు జరిగాయని అధికారులే పరోక్షంగా ఎన్జీటీకి తెలిపారు. వాటిని పరిశీలించిన తాజా కూటమి ప్రభుత్వం అక్రమాలు ఏ స్థాయిలో జరిగాయో పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని ఆదేశాలిచ్చింది. దీంతో మైనింగ్ అధికారులు ఎటువంటి నివేదిక ఇస్తారన్నది ఆసక్తిగా మారింది. అదే సమయంలో అక్రమార్కుల్లో వణుకు మొదలైంది. కాగా మైనింగ్ డీడీ శ్రీనివాసకుమార్‌ను వివరణ కోరగా ఇసుక అక్రమ తవ్వకాలపై నివేదిక ఇవ్వాలని ఆదేశాలు వచ్చిన మాట వాస్తవమేనని చెప్పారు. 18 ప్రాంతాల్లో విచారించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు.











దర్గాలో బారాషహీదులను దర్శించుకుంటున్న భక్తులు

భక్తజనం తుళ్లింత
సింహపురి పులకింత!

- బారాషహీద్ దర్గాకు పోటెత్తిన యాత్రికులు
- అర్ధరాత్రి తర్వాత గంధమహోత్సవం
- నేడు సీఎం చంద్రబాబు వర్చువల్ సందేశం



నెల్లూరు (సాంస్కృతికం) జూలై 18 : నెరవేరిన కోరి కలతో కొందరు.. కొత్త కోరికలతో ఇంకొందరు.. తొలిసారిగా మరికొందరు ఇలా భక్తజనం తరలిరావడంతో బారాషహీద్ దర్గా, స్వర్ణాల చెరువు ఘాట్ లు కిక్కిరిసిపోయాయి. దేశం నలుమూలల నుంచి రైళ్లు, బస్సులలో వస్తుండగా, సొంత వాహనాల్లో వస్తున్నవారితో నగరం జన సంద్రంగా మారింది. స్వర్ణాల చెరువుకు చేరుకున్న భక్తులు తమ కోర్కెలు తీరిన రొట్టెలను విడిచి మొక్కులు తీర్చుకున్నారు. కోర్కెల రొట్టెలు కావా ల్సిన వారు వాకాబు చేస్తూ రొట్టెలను పట్టుకుంటున్నారు. ఆ తర్వాత బారాషహీద్‌లను దర్శించుకుని పూజలు చేశారు. పండుగ రెండు రోజుల్లోనే దాదాపు 3లక్షల మందికి పైగా భక్తులు వచ్చినట్టు అధికారులు అంచనా వేస్తున్నారు.

మంత్రి ఆనం పరిశీలన

రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సాయంత్రం బారాషహీద్ దర్గాను సందర్శించారు. భక్తులకు అందుతున్న సౌకర్యాలు, సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. విలేకరులతో మంత్రి మాట్లా డుతూ శుక్రవారం ఉదయం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా తన సందేశాన్ని ఇవ్వనున్నట్లు తెలిపారు. భక్తులతోనూ ముఖ్యమంత్రి మాట్లాడతారని తెలిపారు. రొట్టెల పండుగ పట్ల చంద్రబాబుకు ప్రత్యేక అభిమానం ఉంద న్నారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిలతో పాటు కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్, అదనపు కమిషనర్ శర్మద, ఇతర అధికారులు, ఫెస్టివల్ కమిటీ అధ్యక్షుడు ఖాదర్ బాషా తదితరులు మంత్రి వెంట ఉన్నారు. రాత్రి ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి దర్గాలో పూజలు చేసి, అనంతరం భక్తులకు రొట్టెల పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



పండుగ ఏర్పాట్లను మ్యాప్ ద్వారా మంత్రి ఆనంకు వివరాలు తెలుపుతున్న కమిషనర్, పక్కన కలెక్టర్, ఎస్పీ



ఏర్పాట్లపై ఆరా తీస్తున్న మంత్రి నారాయణ

అర్ధరాత్రి తర్వాత గంధమహోత్సవం

గురువారం అర్ధరాత్రి తర్వాత గంధ మహోత్సవం వైభవంగా జరిగింది. నగరంలోని కోటమిట్ట అమీనియా మసీ దులో సయ్యద్ సమీహుసేనీ ఆధ్వ ర్యంలో మతపెద్దలు 12 బిందెల్లో గంధాన్ని కలిపారు. అక్కడ నుంచి ప్రత్యే కంగా ఏర్పాటు చేసిన రథంలో ఊరేగింపుగా బారాషహీద్ దర్గా ఆవరణలోని ఈద్గాకు గంధాన్ని చేర్చారు. అక్కడ ఫకీర్ల జరబ్‌లు ప్రత్యేక దువా కార్యక్రమాలు నిర్వహించారు. పోలీసు బందోబస్తుతో పెద్ద గంధం బిందెను గుర్రంపై తీసుకుని దర్గాలోకి చేర్చారు. కడప పీఠాధిపతులు సయ్యద్ ఆరీఫుల్లా హుసేనీ, చిష్టీవుల్ ఖాదరి, సయ్యద్ సమీహుసేని ఇతర మత పెద్దలు బారాషహీద్‌లకు గంధం లేపనంతో పూజలు చేసి కొత్త గలీఫ్‌లు కప్పారు. అనం తరం భక్తులకు గంధం ప్రసాదం పంచారు. ఈ కార్యక్రమం ముగియడంతో రొట్టెలపండుగా ప్రారంభమైనట్లు అయ్యింది. సుదూర ప్రాంతాల నుంచి రొట్టెలపండుగకు వచ్చిన భక్తులకు కొందరు స్వచ్ఛందంగా ఆకలి, దప్పికలను తీర్చుతున్నారు. తెలుగుదేశం నాయకుడు పి.చెంచలబాబు యాదవ్ దర్గాలో పూజలు చేసి, స్వర్ణాల చెరువులో మొక్కు చెల్లించుకున్నారు. గత సంవత్సరం రొట్టెల పండుగలో నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని తాను రొట్టెను పట్టుకున్నట్లు తెలిపారు.







వీఎస్‌యూ ఇన్‌చార్జ్ వీసీగా విజయభాస్కర్‌రావు




వెంకటాచలం, జూలై 18 : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (వీఎస్‌యూ) ఇన్‌చార్జి ఉపకులపతిగా (వీసీ) డాక్టర్ సారంగం విజయ భాస్కర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి సౌరభ్‌గౌర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర యూని వర్సిటీలో ఫిజిక్స్ విభాగంలో విజయభాస్కర్ రావు విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉదయం ఆయన బాధ్యతలు చేపట్టనున్నట్లు వర్సిటీ వర్గాలు తెలిపాయి.

హమ్మయ్యా.. గట్టెక్కాం!

- ఇంజనీరింగ్ సీట్ల భర్తీపై ఊరట
- జిల్లాలో 81.3 శాతం భర్తీ
- నేటి నుంచి తరగతులు ప్రారంభం

నెల్లూరు (విద్య), జూలై 18 : చాన్నాళ్లకు జిల్లాలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో సీట్ల భర్తీ ఆశాజనకంగా పూర్తయ్యాయి. వైసీపీ ప్రభుత్వం తీరువల్ల ఇంజనీరింగ్ సీట్లు భర్తీకాక కళాశాలలు వెలవెలబోయాయి. గతంలో జిల్లాలో 22 కళాశాలలు ఉండగా గత వైసీపీ ప్రభుత్వ వేధింపులు, ఫీజు రీఎంబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడం, ఫీజుల్లో కోతలు ఇలా అన్ని రకాల ఇబ్బందులతో కొన్ని కళాశాలలు మూతపడ్డాయి. ఈ ఏడాది కేవలం 14 కళాశాలలు మాత్రమే జిల్లాలో మిగిలాయి. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, పరిస్థితి కొంత మెరుగుపడటంతో ప్రమాణాలు పాటిస్తున్న కళాశాలల్లో మాత్రం ఆశావహంగానే సీట్ల భర్తీ కావడం గమనార్హం. ఇంజనీరింగ్ సీట్ల కేటాయింపు పూర్తవడంతో ఆయా కళాశాలల్లో ఏ మేరకు భర్తీ అయ్యాయో స్పష్టత వచ్చింది. అర్హత ఉన్న విద్యార్థులకు పూరి స్థాయిలో ఫీజు రీయింబర్స్ మెంట్ వర్తించనుంది.



2024-25 విద్యా సంవత్సరానికి జిల్లాలో 14 ఇంజనీరింగ్ కళాశాలల్లో 8,722 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, సివల్ ఇంజనీరింగ్ సీట్లు ఉన్నాయి. ఇంజనీరింగ్‌లో చేరే విద్యార్థులు కళాశాల స్థితిగతులు, సౌకర్యాలు, ఫ్యాకల్టీలు, క్యాంపస్ ఇంటర్వ్యూలు తదితర విషయాలను పరిగణలోకి తీసుకుని ఎంపిక చేసుకున్నారు. గత ఏడాది 22 కళాశాలల్లో 10,500 సీట్లకు గాను 3,408 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. ఈ ఏడాది మాత్రం 8,722 సీట్లకు 6,788 సీట్లు (81.03 శాతం) భర్తీతో కొంతమేర సంతృప్తి ఇచ్చిందని కళాశాలల యాజమాన్యాలు తెలిపాయి. ఇంటర్‌ను దిగ్విజయంగా పూర్తిచేసి ఎంసెట్‌లో మంచి ర్యాంకు సాధించిన విద్యార్థులు ఇంజనీరింగ్‌లో చేరడానికి చేపట్టిన వెబ్ ఆప్షన్‌లు నమోదు ప్రక్రియ పూర్తయింది. ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశాలకు జులై 1 నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభించి పూర్తి చేశారు. 13వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల ప్రక్రియ పూర్తి చేసుకోవడంతో 16న కళాశాలలు, బ్రాంచ్‌ల సీట్లు కేటాయింపులు జరిగాయి. సీట్లు దక్కించు కున్న విద్యార్థులు ఈ నెల 22వతేదీ వరకు సంబంధిత కళాశా లల్లో రిపోర్ట్ చేయను న్నారు. శుక్రవారం తరగతులు కూడా ప్రారంభం కానున్నాయి.

ప్రాంతం	కళాశాల పేరు	మొత్తం సీట్లు	భర్తీ
నెల్లూరు	నారాయణ	624	613
గూడూరు	నారాయణ	528	513
కోవూరు	గీతాంజలి	768	744
కావలి	ఆర్ఎస్ఆర్	480	455
వాకాడు	ఎన్బీకేఆర్	1104	982
కావలి	పీబీఆర్ విశ్వోదయా	1248	1108
ఆత్మకూరు	ఆంధ్ర	216	175
కొడవలూరు	శ్రీవెంకటేశ్వర	1440	1117
గూడూరు	ఆదిశంకర	1368	828
సూళ్లూరుపేట	గోకులకృష్ణ	288	171
నెల్లూరు	ప్రియదర్శిని-2	48	17
కావలి	డీబీఎస్	235	29
వెంకటాచలం	క్యూబా	63	10
నెల్లూరు	ప్రియదర్శిని-1	312	16



హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి

- జిల్లా న్యాయాధికారి యామిని

నెల్లూరు (లీగల్), జూలై 18: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని జిల్లా న్యాయాధికారి సీ.యామిని సూచించారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో గురువారం జరిగిన హెల్మెట్ వినియోగంపై అవగాహన కార్యక్రమంలో పాల్గొని న్యాయమూర్తులు చేపట్టిన ర్యాలీని యామిని ప్రారంభించి, మాట్లాడారు. వాహనాలు నడిపేటప్పుడు తమ విలువైన జీవితంతోపాటు కుటుంబ సభ్యులను కూడా మనసులో పెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయాధికారులు జి.కబర్ది, ఎల్.తేజోవతి, శ్రీనివాసరావు, ఎం.సరస్వతి, జీ.గీత, పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయాధికారి సుమలత, లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి కె.వాణి, ప్రిన్సిపల్ సీనియర్ ఐ.కరుణ కుమార్, న్యాయాధికారులు ఎల్.లావణ్య, గండికోట దేవిక, శారదారెడ్డి, బి.అఖిల, వినోద్ కుమార్, రాష్ట్ర బార్ కౌన్సెల్ సభ్యుడు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీ.ఉమామహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో స్టాంపుల కొరత

జిల్లా కోర్టులో స్టాంపుల కొరత తీవ్రంగా ఉంది. నెల్లూరులో సుమారు 18 కోర్టుల వరకు ఉండగా, న్యాయవాదులకు 1, 2 రూపాయల స్టాంపుల అవసరం ఉంటుంది. అయితే, రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు వాటిని తెప్పించడంలో కాలయాపన చేస్తున్నారు. గూడూరు, నాయుడుపేట, కోవూరు వంటి ప్రాంతాల్లో మాత్రం ఇవి దొరుకుతున్నాయి. నెల్లూరులో కొరత ఏర్పడటానికి కారణాలు తెలియడంలేదు. ఫలితంగా న్యాయవాదులు రూ.5ల స్టాంపులను వాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రూ.1, 2ల స్టాంపులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని న్యాయవాదులు, న్యాయవాద గుమాస్తాలు కోరుతున్నారు.

పురపాలక సంఘ కార్యాలయము, కందుకూరు

ఆర్.ఓ.సి.నెం. 115/2015/ఏ1 తేది : 16-07-2024

బహిరంగ వేలం నోటీసు

కందుకూరు పురపాలక సంఘమునకు చెందిన దినవారీ మార్కెట్ మరియు చేపలు, మాంసము మార్కెట్‌లకు చెందిన రుసుము వసూలు చేసుకొనుటకు **2024-25** సంవత్సరమునకు అనగా **తేది.01-08-2024 నుండి 31-03-2025 వరకు** 8 నెలలు కాలమునకు గజిట్ నోటిఫికేషన్ నెం.76, తేది : 16-07-2024 నందు పొందుపరచిన రేట్ల ప్రకారము మరియు షరతులకు లోబడి గుత్తకు ఇచ్చుటకు **తేది.24-07-2024 ఉదయము 11.00 గంటలకు** పురపాలక సంఘ కార్యాలయము నందు కమీషనరు గారిచే లేక వారి యొక్క అధికారము పొందిన వేరొక అధికారిచే గాని బహిరంగ వేలము జరుపబడును.

వ. నెం.	గుత్త వివరములు	చెల్లించవలసిన ధరావత్తు సొమ్ము	దాఖలు పరచవలసిన సాల్వెన్సీ లేక ప్రాపర్టీ పత్రము
1.	దినవారీ మార్కెట్ మరియు చేపలు మాంసము మార్కెట్ నందు రుసుము వసూలు చేసుకొనేడి హక్కు	రూ. 4,00,000	రూ. 7,00,000

గమనిక :

1. పాటలో పాల్గొనుటకు ముందుగా కందుకూరు పురపాలక సంఘ ఖజానా యందు సొమ్ము చలానా ద్వారా చలానా రుసుము లేదా నగదును కానీ పాట కాలమందు దాఖలు పరచవలయును.
2. నిర్ణయించిన మేరకు సాల్వెన్సీ లేక ప్రాపర్టీ పత్రము కందుకూరు మండల రెవెన్యూ అధికారి వారి నుండి 2024 సంవత్సరము ఏప్రియల్ నెల తదుపరి మరియు పాట కాలమునకు ముందుగా పొందబడినదయి యుండవలెను.
3. హెచ్చు పాటదారుడు అగ్రిమెంటు రిజిస్ట్రేషన్ చార్జీలు మరియు ప్రభుత్వము యొక్క సర్వీస్ ట్యాక్స్ 18% చెల్లించవలెను.
4. పాట సమయములో సాల్వెన్సీ సమర్పించలేని వారు సాల్వెన్సీ మొత్తము నగదు రూపములో డిపాజిట్ చేయవలెను. పాట రాని యెడల సదరు మొత్తము వాపసు ఇవ్వబడును.
5. బహిరంగ వేలములో పాల్గొను పాటదారులు కందుకూరు పురపాలక సంఘమునకు ఎటువంటి బకాయిలు ఉండకూడదు. అట్టివారు అనర్హులు.

ఏ కారణము తెలుపకనే వేలంపాట నిలిపివేయుటకు గాని, వాయిదా వేయుటకు గాని పురపాలక సంఘం వారికి అధికారము కలదు. పూర్తి వివరములు పురపాలక సంఘ కార్యాలయపు పనివేళల యందు అడిగి తెలుసుకొనవలెను.

సం/- **కమీషనరు**
కందుకూరు పురపాలక సంఘం

డ్రోన్ కెమెరాల నిఘా నీడలో దర్గా

● గంధమహోత్సవ బందోబస్తు పరిశీలించిన ఎస్పీ

నెల్లూరు (క్రైం), జూలై 18: రొట్టెల పండుగ రెండవ రోజు గురు వారం డ్రోన్ కెమెరాల నిఘా నీడలో బారాషాహీద్ దర్గా ప్రాంగణం, పరిసర ప్రాంతాలను పోలీసులు పహారా కాశారు. గంధమహో త్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన భద్రత ఏర్పా ట్లును జిల్లా ఎస్పీ జీ.కృష్ణకాంత్ పరిశీలించారు. దర్గాలో ఏర్పాటు చేసిన తాత్కాలిక కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసిన డ్రోన్, పిటి జెడ్, సీసీ టీవీ ఫుటేజీలను ఎస్పీ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రెండవ రోజు 140 మంది తప్పిపోయిన చిన్నారులను వారి తల్లిదండ్రులకు, పెద్దలను కుటుంబసభ్యులకు అప్పగించా మన్నారు. సీసీఎస్ పోలీసులు తొమ్మిది మంది పిక్‌పాకెట్ సస్పెక్ట్‌లను గుర్తించి, విచారించి మూడు బ్యాగులను బాధితులకు అప్పగించామన్నారు. యాత్రికుల భారీ వాహనాలు నగరంలోని రాకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ తనిఖీల్లో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, డిఎస్పీలు శ్రీనివాసరెడ్డి, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.


సీసీ కెమెరాల ఫుటేజ్‌లను పరిశీలిస్తున్న ఎస్పీ



సంపద రొట్టె ఇచ్చేందుకు వచ్చాము



రొట్టెల పండక్కి రెండోసారి వచ్చాము. గతంలో వచ్చి సంపద రొట్టె పట్టుకుని వెళ్లాము. దేవుడి దయవల్ల మంచి మా కోరిక తీరింది. తిరిగి సంపద రొట్టె ఇచ్చేం దుకు ఇప్పుడు వచ్చాము. మనసారా కోరుకుంటే ఖచ్చి తంగా మంచి జరుగుతుంది. నమ్మకంతో ఇక్కడకు రావాలి అంతే.

- శారద కుటుంబం, కర్నూలు

సొంతింటి కోసం వచ్చాం



మా కుటుంబం ఇక్కడకు రావడం ఇది మూడవ సారి. మాకు ఎంతో నమ్మకం. సొంతిళ్ల కట్టాలి. ధనం కూడబెట్టుకోవాలన్నది మా కోరిక. అవి నెరవేరుతాయని ఆశిస్తూ రొట్టెలు పట్టుకున్నాము. గతంలో వేరే కోరికలతో వచ్చాము అవి నెరవేరాయి.

- హోమితునిషా కుటుంబం, మహారాష్ట్ర

సంతాన రొట్టె కోసం వచ్చా

నాకు సంతానం కలగాలని రొట్టెను పట్టుకునేందుకు వచ్చాను. అలాగే చేస్తున్న పనిలో వృద్ధి కలగాలని కోరుకున్నా. ఇదే తొలిసారిగా ఇక్కడకు రావడం. ఇక్కడ ఇంతమంది భక్తులను చూస్తుంటే చాలా ఆశ్చర్యంగా ఉంది. ఇన్నీ రోజులు ఇక్కడకు ఎందుకు రాలేకపోయానని బాధగానూ ఉంది.

- అల్నియా, హిందుపురం



ఎంతో నమ్మకంతో వస్తున్నాం

మా కుటుంబం ఇక్కడకు రావడం ఇది మూడవ సారి. ఈ సారి ఆరోగ్య రొట్టె తీసుకుందామని వచ్చాము. గతంలో ఇల్లు, వృత్తి అభివృద్ధి రొట్టెలు తీసుకెళ్లాము. వాటిని ఇప్పుడు వదిలేసి ఆరోగ్య రొట్టె తీసుకున్నాము. నమ్మకంతో వస్తున్నాము.

- ఫర్వీన్ కుటుంబం, గుంటూరు



ఏఎస్ పేటలో భక్తుల సందడి

ఏఎస్ పేట, జూలై 18: నెల్లూరులోని బరాషాహీద్ దర్గాలో జరిగే రొట్టేల పండుగ సం దర్భంగా రెండురోజులుగా ఏఎస్‌పేట దర్గాలో భక్తుల సందడి మొదలైంది. గురువారం దర్గా లో భక్తులు రద్దీ పెరిగింది. పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులతో దర్గా ప్రాంగణం కిటకిటలాడింది. ఈ సందర్భంగా దర్గా ఈవో దర్గా పరిసర ప్రాంతాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు. వాహనా రాకపోకలకు ఆటంకం లేకుండా ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నారు. శుక్ర, శని, ఆదివారాల్లో పెరిగే అవకాశం ఉంది.

వర్షంతో భక్తులకు ఇబ్బందులు

గ్రామంలో ఎటు చూసిన యాత్రికులే దర్శనమిస్తున్నారు. ఈ తరుణంలో గురువారం మధ్యాహ్నం వర్షం కురవడంతో భక్తులకు ఇబ్బందులు తప్పలేదు. యాత్రికులు చెట్ల కింద, వరండాల్లో తల దాచుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసి దుకాణాలు గాలివానకు పట్టలు తొలగిపోవడంతో అవస్థలు పడ్డారు. యాత్రస్థలం కావడంతో వసతి గృహం, మండపం లాంటివి లేపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని గ్రామస్థులు, భక్తులు మండిపడుతున్నారు. భక్తుల సౌకర్యార్థం కామన్ వసతిగృహం నిర్మించేలా వక్ఫ్‌బోర్డు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కసుమూరు దర్గాకు పోటెత్తిన భక్తులు


వెంకటాచలం, జూలై 18: కసుమూరు మస్తాన్ వలీ దర్గా గురువారం భక్తులతో కిటకిటలాడింది. నెల్లూరు బారా షాహిద్ దర్గా వద్ద జరుగుతున్న రొట్టెల పండుగకు హాజరైన భక్తులు మస్తాన్ వలీ దర్గాను దర్శించుకుని ప్రార్థనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ప్రభుత్వ ఆరోగ్య శాఖ అధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వక్ఫ్ బోర్డు అధికారులు తాగునీటి చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. భక్తుల భద్రత దృష్ట్యా దర్గా ప్రధాన మార్గంలో పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటుచేసి బందోబస్తు కొనసాగించారు.



సీనియర్ నేత చెలికం శంకరరెడ్డి కన్నుమూత

వెంకటగిరి/డక్కిలి, జూలై 18 : విక్రమ సింహపురి ఆర్టీసీ రీజియన్ మాజీ చైర్మన్ చెలికం శంకర రెడ్డి(87) శుక్రవారం తెల్లవారుజామున మాధవాయపాళెం లోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు. వెంకటగిరి సమితి అధ్యక్షుడిగా, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా ఆయన సేవలందించారు. వెంకటగిరి రాజాల వర్గీయుడిగా రాజకీయ ఆరంగేట్రం చెసిన చెలికం సుదీర్ఘ కాలం పాటు మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధనరెడ్డికి ముఖ్య అనుచరుడిగా ఉన్నారు. నేదురుమల్లి హయాంలో జిల్లా రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించారు. 2007లో అనుచరగణంతో చంద్రబాబు నాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా పనిచేశారు. 2009 ఎన్నికల్లో కురుగొండ్ల రామకృష్ణ విజయానికి కృషి చేశారు. చెలికం మరణించారని తెలియగానే ఆయన స్వగ్రామం డక్కిలి మండలం మాధవాయపాళెంలో విషాదం నెలకొంది. ఆయన భౌతికకాయానికి వివిధ పార్టీల నాయకులు, ప్రజలు నివాళులు అర్పించారు.శంకరరెడ్డి కి నివాళులర్పించిన వారిలో ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, వెంకటగిరి వైసీపీ ఇన్‌చార్జి నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరరావు, జిల్లా గ్రంధాలయ అభివృద్ధి సంస్థ మాజీ చైర్‌పర్సన్ దొంతు శారద, వెంకటగిరి ఏఎంసీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు తదితరులున్నారు.


శంకరరెడ్డికి నివాళులర్పిస్తున్న కురుగొండ్ల, సోమిరెడ్డి


చెలికం శంకరరెడ్డి (ఫైల్ ఫొటో)

చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), జూలై 18: అప్పుల బాధతో పాటు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో విష గుళికలు మింగి నెల్లూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బ్రహ్మేశ్వరం గ్రా మానికి చెందిన మారెళ్ల వెంకటస్వామి (50) కోలుకోలేక గురువారం మృతి చెందాడు. మృతునికి భార్య ఇద్దరు కుమారులు, కుమార్తె ఉంది.


మారెళ్ల వెంకటస్వామి(ఫైల్)

గేదెలను తరలిస్తుండగా పట్టుకున్న స్థానికులు

మర్రిపాడు: ఉమ్మాయిపల్లెలో బుధవారం అర్ధ రాత్రి దొంగలు పడి గేదెలను తరలిస్తుండగా గ్రామస్థులు గుర్తించి వారిని పట్టుకున్నారు. రాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో టాటా మ్యాజిక్ వాహనంతో గ్రామంలోకి వచ్చి, రోడ్డుపై పడుకొని వున్న గేదెలను అక్రమంగా వాహనంలోకి ఎక్కిస్తుండగా స్థానికులు ఇద్దరు దొంగలను పట్టుకున్నారు. మరొకరు తప్పించుకున్నారు. వారికి దేహశుద్ధి చేసి గురువారం ఉదయం పోలీసులకు అప్పగించారు. మండలంలో ఇటీ వల గేదెలు దొంగతనానికి గురైనట్లు పలు కేసులు పోలీసుస్టేషన్‌లో నమోదై ఉన్నందున ఆ కోణంలో దొరికిన దొంగల నుంచి వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం.


స్థానికులకు పట్టుబడిన దొంగలు

సోమశిలలో 9.815 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం, జూలై 18: సోమశిల పూర్తిస్థాయి నీటిసామర్థ్యం 77.988 టీఎం సీలు కాగా గురువారానికి డ్యాంలో 9.815 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎగువ నుంచి 20క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

కంద్రికలో ఓ ఇంట్లో చోరీ

మర్రిపాడు, జూలై 18: కంద్రికలోని మేకల శేషయ్య ఇంట్లో బుధవారం రాత్రి దొంగలు పడ్డారు. కుటుంబసభ్యులు వరండాలో నిద్రిస్తుండాగా ఇంటిలోకి ప్రవేశించి, బీరువాలో ఉన్న 850 గ్రాములు వెండి, 64వేల నగదు, భూములకు సంబంధించిన ఫైళ్లను తీసుకెళ్లారు. ఈ విషయాన్ని తెల్లవారుజామున గమనించి బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు సంఘటనా స్థలానకి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. మండలంలో వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు.

శాంపిల్ మందుల నిల్వ కేసులో నిందితునికి మూడేళ్ల జైలుశిక్ష

కోవూరు, జూలై 18: స్థానిక ఎన్‌ఎస్‌ఆర్ కాలనీలోని ఓ ఇంట్లో అక్రమంగా శ్యాంపిల్ మందుల్ని నిల్వ చేశారనే నేరం రుజువు కావడంతో నిందితునికి మూడేళ్ళ జైలుశిక్ష విధిస్తూ మేజిస్ట్రేట్ జే కాత్యాయిని గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శాంతినగర్‌లో నివాసముంటున్న జెట్టి సునీల్‌కుమార్‌రెడ్డి ఎన్‌ఎస్‌ఆర్ కాలనీలో అద్దె ఇల్లు తీసుకుని డాక్టర్లకు మందుల కంపెనీలిచ్చే మందుల్ని (శ్యాంపిల్స్) సేకరించి విక్రయిస్తున్నట్లు స్థానికులు కావలిలోని డ్రగ్ ఇన్‌స్పెక్టరు పీ శ్రీరామమూర్తికి ఫిర్యాదు చేశారు. దీంతో 2012 జూలై 6న ఎన్‌ఎస్‌ఆర్ కాలనీలోని అద్దె ఇంటిపై డ్రగ్‌ఇన్‌స్పెక్టరు అకస్మాత్తుగా దాడిచేసి శ్యాంపిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. శ్యాంపిల్ మందుల వివరాల్ని మధ్యవర్తుల పంచనామాలో పొందుపరిచారు. నిందితుడు జెట్టి సునీల్‌కుమార్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో నిందితుడు జెట్టి సునీల్‌కుమార్‌రెడ్డికి మూడేళ్ళ జైలుశిక్ష, రూ. 20వేల జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ మాల్యాద్రి వాదించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	132
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	238
స్కిన్‌లెస్	254
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7075
వెండి కిలో ధర	రూ. 94,300
వెండి ఒక గ్రాము	రూ. 96.30

డీఆర్‌డీఏలో అవినీతిపై విచారణ జరిపించాలి

● కలెక్టర్‌కు సీపీఐ ఫిర్యాదు

నెల్లూరు (హరనాథపురం), జూలై 18 : డీఆర్‌డీఏ లో జరుగుతున్న అవినీతిపై విచారణ జరిపించాలని సీపీఐ నాయకులు గురువారం కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నేత వాటంబేటి నాగేంద్ర మాట్లాడుతూ స్వయం ఉపాధి కింద డీఆర్‌డీఏ ఆధ్వ ర్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని మండలాల్లో దాదాపు ఒక్కొక్క మండలానికి 50 గొర్రెల యూనిట్లును మంజూరు చేశారన్నారు. అవి ఎక్కడా లబ్ధిదారులకు చేరిన దాఖ లాలు లేవన్నారు. దీనికి ఉదాహరణకు రాపూరు మండలానికి 50 గొర్రెల యూనిట్లు మంజూరు కాగా కేవలం ఇద్దరికి మాత్రమే ఇచ్చి మిగతా వారి యూనిట్ల డబ్బును స్వాహా చేశారన్నారు. ఈ విషయమై సంబంధిత అధికారిపై, ఆ యూనిట్లకు సంబంధిం చిన కాంట్రాక్టర్ శ్రీనివాసులుపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయమై తక్షణ చర్యలు తీసుకోకపోతే లబ్ధిదారులతో కలిసి పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతా మన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పీ.లీలామోహన్, ప్రజావేదిక అధ్యక్షుడు పీ.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందచేస్తున్న సీపీఐ నాయకులు

షోకాజ్ నోటీసు జారీ చేశాం : కేవీ సాంబశివారెడ్డి, పీడీ, డీఆర్‌డీఏ

గొర్రెల యూనిట్లకు సంబంధించి రాపూరులో పనిచేసిన ఏపీఎంకు షోకాజ్ నోటీసు ఇచ్చాం. ఈ ఏపీఎం, గొర్రెల కాంట్రాక్టర్‌కు సంబంధించి విచారణ చేయిస్తున్నాం. వారి నుంచి గొర్రెల యూనిట్లకు సంబంధించిన లబ్ధిదారులకు డబ్బు రావాలని విచారణలో తేలితే రాబట్టి లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకుంటాం.

మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్య

నెల్లూరు(క్రైం): పాఠశాలలో తనను ఉపాధ్యాయుడు స్కేల్‌తో కొట్టి, బెంచ్‌పై నిల్చోబెట్టాడన్న మనస్తాపంతో ఓ విద్యార్థి బుధవారం రాత్రి మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సేకరించిన సమాచారం మేరకు.. మాగుంట లేవుట్ ఇస్కాన్ సిటీలోని సరోజని హైట్స్ అపార్ట్‌లో కృష్ణమూర్తి, అపర్ణ దంపతులు నివాసం ఉంటున్నారు. వారి కుమారుడు ఆర్‌వీసీ.జయధర్(15) నగరంలోని ఓ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. ఆ విద్యార్థి చదువులో పాఠశాలలో అందరికంటే ముం దుండే వాడు. ఈ క్రమంలో బుధవారం పాఠశాలలోని తరగతి గదిలో ఉపాధ్యాయుడు స్కేల్‌తో కొట్టి టేబుల్‌పై నిల్చోబెట్టాడు. విద్యార్థులందరి ముందు ఉపాధ్యాయుడు కొట్టి, బెంచ్‌పై నిల్చోబెట్టడంతో మనస్తాపానికి గురైన జయధర్ అదే రోజు ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో గదిలో కిటికీకి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన తల్లి స్థానికుల సహకారంతో కుమారుడును కిందకు దించి చూడగా అప్పటికే మృతి చెందాడు. స్కూలు సిబ్బంది అవమానపర్చడం వల్లే మా కుమారుడు మృతి చెందాడని తల్లిదం డ్రులు దర్గామిట్ట పోలీసులకు బుధవారం రాత్రి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. వైద్యులు పోస్టుమార్టం చేసి తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మొండి బకాయిదారులకు నోటీసులు ఇవ్వండి

నెల్లూరు(హరనాథపురం), జూలై 18 : వాయిదా మీరిన బకాయిలు రాబట్టడానికి బకాయిదారులకు నోటీసులు జారీ చేయాలని జిల్లా సహకారశాఖాధికారి గుర ప్ప పీఏసీఎస్‌ల సీఈవోలను ఆదేశించారు. పీఏసీఎస్‌ల సీఈవోలకు ఆన్‌లైన్ ద్వారా బకాయిల రాబట్టడంపై గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా గురప్ప మాట్లాడుతూ మొండి బకాయిలపై చట్టపరమైన నోటీసులు జారీ చేసి, సెక్షన్ 71 ప్రకారం దావాలు దాఖలు చేయాలన్నారు. స్థిర, చరాస్తుల జప్తు, వేలంపై చట్టపరమైన నిబంధనలను వివరించారు. భారతీయ కాలదోష చట్టం 1963, సివిల్ ప్రొసీజర్ కోడ్ నిబంధనల గురించి వివరించారు.

ముగిసిన కలిగిరమ్మ ఉత్సవాలు

కలిగిరి, జూలై 18: స్థానిక గ్రామదేవత కలిగిరమ్మ ఉత్సవాలు గురువారం వైభవంగా ముగిశాయి. ఉద యం మహిళా భక్తులు పొంగళ్లు అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. విశేష పుష్పాలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారిని దర్శించుకొని భక్తజనం పరవశించిపోయారు. సాయంత్రం రైతులు ఎడ్లబండ్లను, ట్రాక్టర్లను ప్రభలతో అందంగా అలంకరించుకొని కుటుంబసభ్యుల సమేతంగా ఆలయం చుట్టూరా ప్రదక్షిణలు తిరిగారు. ఆలయం ఎదుట సుడిమాను తిప్పే కార్యక్రమం అలరించింది. మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖరరెడ్డి సతీమణి, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ శాంతకుమారి కలిగిరమ్మను దర్శించుకొన్నారు. ఆలయ పూజారి అమ్మవారి చీర, పసుపు, కుంకుమలు ఆమెకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బిజ్జం కృష్ణారెడ్డి, కాకు మహేష్, ఉసా మాల్యాద్రి, జిర్రా పెద అంకిరెడ్డి, సురేష్, కొప్పోలు కొండలరావు ఉన్నారు.



22 నుంచి శిక్షా సప్తాహ్

నెల్లూరు(విద్య), జూలై 18 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ విద్యా విధానం నాలుగవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో ఈనెల 22 నుంచి 28వ తేదీ వరకు అన్ని యాజమాన్య పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 22న ఉపాధ్యాయులు స్థానిక వనరులతో బోధన అభ్యసన సామగ్రిని తయారు చేసి ప్రదర్శిస్తారు. 23న పునాది అభ్యసన, సంఖ్యాశాస్త్రం నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమం అమలు చేసేందుకు ప్రజలను భాగస్వాములను చేసేలా అవగాహన కల్పిస్తారు. 24న క్రీడాపోటీలు, 25న ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు, 26న మెరుగైన విద్యావిధానం, డిజిటల్ నైపుణ్యాలు గుర్తిస్తారు. 27న పర్యావరణ పరి రక్షణ సంకల్ప యాత్ర, పోషణ దినోత్సవ నిర్వహణ, పాఠశాలల్లో కొత్త ఎకో క్లబ్‌లు ఏర్పాటు, విద్యార్థులకు మాతృమూర్తి బంధాన్ని మరింత బలోపేతం చేసేలా అమ్మపేరుతో అమ్మతో కలిసి మొక్కలు నాటించడం, వాటిని అమ్మకు అంకితమిచ్చే కార్యక్రమాలను నిర్వహిస్తారు. చివరి రోజైన 28న విద్యార్థులు సామాజిక భావోద్వేగ శ్రేయస్సు కోసం స్థానిక ప్రజలు, తల్లిదండ్రుల కమిటీలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘాల సహకారంతో నైపుణ్యాభివృద్ధికి పర్యావరణ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు.

● విద్యారంగంలో సంస్కరణలకే కార్యక్రమం..

జాతీయ నూతన విద్యావిధానం ప్రవేశపెట్టిన తరువాత పరివర్తనాత్మక సంస్కరణలు, విద్యాభివృద్ధి చేయడంలో నిబద్ధతను తెలియచేసే దిశగా ఈ కార్యక్రమాలు ఉంటాయని సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సీహెచ్.ఉషారాణి తెలిపారు. అన్ని పాఠశాలల్లో ఈ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

విద్యార్థుల సమ్మిళిత అభివృద్ధే లక్ష్యం

● డీఈవో రామారావు

నెల్లూరు(విద్య), జూలై 18: విద్యార్థుల సమ్మిళిత అభివృద్ధే విద్యాశాఖ లక్ష్యమని జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే.రామారావు తెలిపారు. నగరంలోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న తొమ్మిది రోజుల టీచ్ టూల్ ట్రైనింగ్ కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలన్న లక్ష్యంతో పాఠశాల విద్యాశాఖ ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. దీనిలో భాగంగానే జిల్లా వ్యాప్తంగా నిష్ణాతులైన హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలను 554 మందిని ఎంపిక చేసి వారికి నెల్లూరు, కావలి, కందుకూరు, ఆత్మకూరు డివిజన్లలో ఒకేసారి శిక్షణ అందిస్తున్నామన్నారు. 9 రోజుల పాటు శిక్షణ పొందిన వీరంతా జిల్లా వ్యాప్తంగా వారి స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలో వారానికి రెండు రోజుల పాటు ఆయా పాఠశాలలను పరిశీలిస్తారన్నారు. తరగతి గదిలో టీచర్ అందించే బోధన ఎలా ఉంది, విద్యార్థి దానిని ఎలా అర్థం చేసుకుంటున్నాడన్న అంశాలను పరిశీలిస్తారని పేర్కొన్నారు. అనంతరం సభ్యులు పరిశీలించిన అంశాలను టీచ్ యాప్‌లో అప్‌లోడ్ చేసి విద్యాబోధనలో ఎలాంటి మార్పులు చేసుకోవాలో, విద్యార్థికి ఎలా నాణ్యమైన విద్యను అందించాలన్న విషయాలను ఉపాధ్యాయులకు తెలియచేస్తారన్నారు. దీనివలన విద్యార్థి తన చదువుకు మరింత పదును పెట్టి ఉత్తమంగా ఎదిగేందుకు దోహదపడుతుందన్నారు. ఈనెల 18 నుంచి 27వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ శిక్షణలో సభ్యులంతా నిబద్ధతో పాల్గొని విద్యాభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. ఎస్ఎస్ఏ ఏపీసీ సీహెచ్.ఉషారాణి మాట్లాడుతూ శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులంతా దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ ప్రాముఖ్యతను గుర్తించి సమయానుగుణంగా హాజరై విద్యార్థులకు మంచి జరిగేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు డిప్యూటీ ఈవో ప్రసన్నలక్ష్మి, ఏఎంవో సుధీర్‌బాబు, ఎంఈవో ఆర్.మురళీధర్, జిల్లా కోఆర్డినేటర్ షకీల్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఈవో రామారావు

పట్టాదారుడికి తెలియకుండా అక్రమ రిజిస్ట్రేషన్

నెల్లూరు(సాంస్కృతికం) జూలై 18 : జిల్లాలోని సీతారామపురం మండలం సీతారామపురంలో సర్వే నెంబరు 536లోని 5.69 సెంట్ల భూమిని పట్టాదారులైన తమకు తెలియకుండానే అక్రమ రిజిస్ట్రేషన్ జరిగిందని బాధితులు వాడా వెంకటసుబ్బయ్య, వాడా వెంకటసుబ్బమ్మ, వారి కుమారులు వాపోయారు. ఈ మేరకు గురువారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ అక్రమ రిజిస్ట్రేషన్‌కు కారణం సీతారామపురం తహసీల్దారు కార్యాలయంలోని కొందరు అధికారులే కారణమని తెలిపారు. తమ భూములను కడప జిల్లా పొద్దుటూరుకు చెందిన వ్యక్తుల పేరు మీద భూ బదలాయింపు జరిగిందని, అంతేకాకుండా ఆ భూమి మరొకరి పేరు మీద, నంద్యాల జిల్లా కోవెలకుంట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్ చేశారని తెలిపారు. ఈ విషయమై తహసీల్దారు కార్యాలయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, జిల్లా కలెక్టరే తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

బోధన సరళిలో నైపుణ్యాలు పెంచుకోవాలి

● రాష్ట్ర పరిశీలకులు శారదకుమారి

ఆత్మకూరు, జూలై 18: ఉపాధ్యాయుల బోధన సరళిలో నైపుణ్యాలను పెంపొందించమే లక్ష్యంగా టీచ్ టూల్ శిక్షణా తరగతులను తొమ్మిది రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పరిశీలకులు శారదకుమారి తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలలో ఆత్మకూరు డివిజన్‌లోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీ లకు ఏర్పాటు చేసిన శిక్షణా తరగతులను డిప్యూటీ డీఈవో కె గోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఉపాధ్యాయులు బోధన పద్ధతులు, బోధన లోపాలను మెరుగుపరిచేందుకు శిక్షణా తరగతులు ఉపమోగ పడుతాయన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏఎంవో వై.శాంతకుమారి, మండల విద్యాశాఖాధికా రులు ఎం.జ్యోతి, చలపతి, మాస్టర్ ట్రైనీలు సురేష్, నాగేశ్వరరావు, కేశవనారాయణ, సీఆర్పీలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకులు శారదకుమారి

చింతలదీవి పశుసంవర్ధక క్షేత్రంలో ఆవుల వేలం

కొండాపురం: మండలంలోని చింతలదీవి పశుసంవర్ధక క్షేత్రంలో గురువారం ఆవుల వేలంను ఇన్‌చార్జి డీడీ వెంకటేశ్వర్లు రెడ్డి నిర్వహించారు. ఈ వేలంలో 27 మంది రైతులు పాల్గన్నారు. 24ఆవులు, 3 సంవత్సరాలు పైబడిన 14పెయ్యదూడలు, 1 సంవత్సరం పైబడిన 5 పెయ్యదూడలు, 4 కోడె దూడలను వేలంలో రైతులు రూ.10,12, 500లకు దక్కించుకున్నారు. ఏపీఎల్‌డీఏ వైస్‌చైర్మన్ జీ.విజయ్‌కు మార్, కామధేను కేంద్ర జేడీ వెంకటేష్, ఏపీఎల్‌డీఏ ఏడీ రామచంద్రరావు పాల్గొన్నారు.



JOBS @ SBI LIFE

STATE BANK OF INDIA LIFE:Job Vacancies: ASO-3, BM-4, CCO's-4. Qlf: SSC/ Inter/ Deg. Age:25+, F/M. Salary upto 15 K. **Cont: 77023 20574**
AJR-663

WANTED

మా సంస్థలో పనిచేయుటకు మార్కెటింగ్ మేనేజర్, అకౌంటెంట్, డిజిటల్ మార్కెటింగ్ స్టాఫ్ & ITI చదివిన టెక్నీషియన్స్ వెంటనే కావలెను. జీతం + PF + కమీషన్. సం.ప్ర. సెల్: **90007 31560**
AJR-11060

వధువు కావలెను

» డైరెక్ట్ కాంటాక్ట్/ బలిజ / డైవర్స్ / 47 Y/ 5'6'/ ఎరుపురంగు / బిజినెస్ / వరునికి మంచి మనస్సున్న వధువు కావలెను. కులం పట్టింపులేదు. సంప్ర: **98482 45575**
AJB - 194783

ONE SITTING

ఒకే సం.లో Inter, 10th పాస్, దూర విద్య ద్వారా B.A., B.Com., B.Sc., BBA., M.A., M.Com., M.Sc, MSW, MBA, MCA, BLisc, MLisc. శ్రీ భారతి సం.ప్ర. సెల్: **94415 53070**
AJR-178424

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

అప్రమత్తం లేకుంటే రోగాలపాలే!

ఆత్మకూరు, జూలై 18: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుదలపై అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు దృష్టి సారించడం లేదు. దీంతో పారిశుధ్యం గాడి తప్పింది. మురుగు కాలువలు దోమలకు నిలయంగా మారాయి. ప్రజలకు తాగునీటి సరఫరా చేసేవాటర్ ట్యాంకుల శుభ్రతను గాలికివదిలేశారు. ఈ క్రమంలో అంటువ్యాధులు ప్రబలయ్యే అవకాశం ఎక్కువగా ఉంది. నియోజకవర్గంలోని మండలాల్లో ఇప్పటికే సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. పలు గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా మారింది. డ్రైనేజీలు సక్రమంగా లేక మురుగు నీటిలో దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలడానికి కారణమవుతున్నాయి.



ఆత్మకూరు: రామస్వామిపల్లిలో దోమలకు నిలయంగా మారిన పంటకాలువ

వింజమూరు: పట్టణం రోజురోజుకూ విస్తరిస్తూ అభివృద్ధి చెందుతున్న అక్రమ లే అవుట్లు విచ్చలవిడిగా వెలసివున్నాయి. ఈ లేఅవుట్లతో పంట కాలువలు కబ్జాకు గురయ్యాయి. కొన్ని కాలువలు అతి చిన్నవిగా మారాయి. ఉన్న చిన్న కాలువల్లో పూడిక తీయకపోవడంతో చెట్లు పెరిగి అడవిని తలపిస్తున్నాయి. వర్షాకాలంలో ఈ కాలువల ద్వారా పోవాల్సిన నీరు ఎక్కడికక్కడే నిలిచిపోయి పలు ప్రాంతాలు వర్షపు నీటితో నిండిపోతున్నాయి. ముఖ్యంగా బంగ్లాసెంటర్ వద్ద ఉన్న చెరువునకు ఆయ కట్టు లేనందున దాని కింద లేఅవుట్లు వెలిశాయి. కాలువలు లేకపోవడంతో ఉన్న కాలు వలను పట్టించుకోకపోవడం వలన ఆయా ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కాలువలో పూడిక తీసి నీరును పోయేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



వింజమూరు: కాలువలో పెరిగిన చెట్లు

అవసరమైన ప్రతిపల్లెకు ఆర్టీసీ బస్సు

● ఉదయగిరిఎమ్మెల్యే కాకర్ల సురేష్



జెండా ఊపి ఆర్టీసీ బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

ఉదయగిరి రూరల్, జూలై 18: నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో అవసరమైన ప్రతి పల్లెకు ఆర్టీసీ బస్సు నడిపేలా చర్యలు చేపడతామని శాసనసభ్యులు కాకర్ల సురేష్ తెలిపారు. గురువారం ఉదయగిరి ఆర్టీసీ డిపోకు కొత్తగా వచ్చిన హైదరాబాదు బీహెచ్ఈఎల్‌కు ఉదయగిరి నుంచి నడిపేందుకు ఏర్పాటు చేసిన రెండు సూపర్‌లగ్జరీలను డిపో మేనేజర్ శ్రీనివాసరావు, టీడీపీ నాయకులతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ప్రయాణికులు, విద్యార్థుల సౌకర్యార్థం అవసరమైన ప్రతిచోటుకి ఆర్టీసీ బస్సు వెళ్లేలా ఉన్నతాధికారులతో చర్చిస్తామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు త్వరలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తారని చెప్పారు. అందరి సహకారంతో ఉదయగిరి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. వార్డులు, గదులను పరిశీలించారు. చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి సేవలను అడిగి తెలుసుకొన్నారు. వైద్యశాలలో ఎక్స్‌రే పని చేయడంలేదని ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో వివరాలు తనకు పంపాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బయ్యన్న, టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు రియాజ్, సందానీ, నజీల్, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవతం చేయండి

ఏఎస్ పేట, జూలై 18: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ స్థాపించి 80ఏళ్ల పూర్తి చేసుకున్న సందరర్భంగా ఆగస్టు 10వ తేదీ నెల్లూరులోని టౌన్‌హాల్‌లో నిర్వహించే మహాసభను విజయవతం చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి సురేంద్రరెడ్డి తెలిపారు. గురువారం ఆయన పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ బాధ్యులు రామసుబ్బారెడ్డి, సభ్యులు శివకుమార్‌రెడ్డి, ఫణికుమార్, రాఘవరెడ్డి, ప్రసాద్, ప్రభుదాస్, సుధాకర్‌రావు పాల్గొన్నారు.

వరికి.. నీటి ఇబ్బంది రాకుండా చర్యలు

అనంతసాగరం, జూలై 18: అనంతసాగరం చెరువు కింద వరిసాగు చేస్తున్న రైతులకు నీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం చెరువు మొదటి తూమును పరిశీలించారు. తూములో నెలకొన్న అడ్డంకులు తొలగింపునకు చేయాల్సిన పనులపై సిబ్బందికి సూచనలిచ్చారు. తూము ముందు ఇసుక బస్తాలతో రింగ్‌బండ్ వేసి శరవేగంగా పనులు చేసి పంటకు నష్టం వాటిల్లకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈ ఖాదర్, రైతు సంఘం నాయకులు చల్లా శివారెడ్డి, కేతా శ్రీనివాసులురెడ్డి, మల్లెంకొండయ్య ఉన్నారు.

సోమశిలలో పందుల విహారం

అనంతసాగరం, జూలై 18: సోమశిల జలాశయం క్యాంపు కాలనీలో ప్రజలకన్నా ఇక్కడ పందుల సంఖ్య ఎక్కువగా ఉంది. అధికారులు కాలనీపర్యవేక్షణ మరువడంతో దూరప్రాంతాలకు చెందని పందులను తెచ్చి ఇక్కడ వదులుతున్నారని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుంపులుగా పందుల సంచారంతో చిన్నారులకు ఎలాంటి ముప్పు వస్తుందో అని వాపోతున్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

సంగం, జూలై 18: స్థానిక మండల కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం మండలాధ్యక్షురాలు పద్మావతమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో అప్పాజీ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో మండలంలో జరుగుతున్న అన్నిశాఖల అభివృద్ధి కార్యక్రమాలపై చర్చిస్తామన్నారు. సమావేశానికి మండల ప్రాదేశిక సభ్యులు, సర్పంచులు, జిల్లా పరిషత్ సభ్యులతో పాటు అన్నిశాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

వైభవంగా గ్రామోత్సవం

వరికుంటపాడు, జూలై 18: తోటలచెరువుపల్లిలో మొహరం వేడుకల్లో భాగంగా గురువారం పీర్ల గ్రామోత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. బారాహిమాం పీరును ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలతో అత్యంత భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులు దారిపొడవునా వారుకడవలతో నీరు పోసి ప్రార్థనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే సాతువారిపల్లిలోనూ గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

ఉరుములు, మెరుపులతో వర్షం

ఉదయగిరి, జూలై 18: ఉదయగిరి ప్రాంతంలో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈదురు గాలులు వీడయంతో వృద్ధులు, చిన్నారులు, మహిళలు ఇబ్బందులు పడ్డారు. కొంతసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వర్షంతో గ్రామాల్లో రోడ్లు చిత్తడిగా మారాయి.

వరికుంటపాడు: ఉదయం నుంచి ఉక్కపోతను తట్టుకోలేక విసుగెత్తిపోయిన ప్రజలు సాయంత్రం కురిసిన వర్షంతో కొంతమేర ఉపసమనం కలిగించింది. మధ్యాహ్నం నుంచి ఒక్కసారిగా వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల దృష్ట్యా ఉరుములు, మెరుపుల బీభత్సం నడుమ వర్షం కురిసింది.

ఆలయంలో ఆర్ఎం ప్రత్యేక పూజలు

వరికుంటపాడు, జూలై 18: స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం కెనరా బ్యాంకు రీజనల్ మేనేజరు నాగరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ధర్మకర్త పెండ్యాల సూర్యనారాయణ శాలువాలతో సన్మానించి స్వామి చిత్రపటాన్ని బహూకరించారు. అర్చకులు భార్గవ రామాచార్యులు, సీతారామాచార్యులు, బ్యాంకు మేనేజరు చంద్రశేఖర్, రీజనల్ కార్యాలయ అసిస్టెంట్ మేనేజరు చంద్రశేఖర్, శివరామిరెడ్డి, షేక్ పీరయ్య, పాల్గొన్నారు.



చిత్రపటాన్ని అందజేస్తున్న గ్రామస్థులు

యువనేత లోకేష్‌కు ప్రత్యేక అభినందనలు

వింజమూరు, జూలై 18 : కష్టాల్లో ఉన్న వారికి సాయం చేయడం యువనేత నారా లోకేష్ నైజమని, అదే అతిన్న ప్రజల అభిమాన నేతగా మార్చిందని జిల్లా తెలుగు యువనేత గణపం సుదర్శన్‌రెడ్డి తెలిపారు. పొట్టకూటి కోసం గల్ఫ్ దేశానికి వెళ్లిన శివ అక్కడి కష్టాలను సోషల్ మీడియా ద్వారా యువనేత లోకేష్ చూసి చలించిపోయి శివను వారి కుటుంబసభ్యుల దగ్గరకు చేర్చడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

అంధ్రప్రదేశ్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల
పెదపవని, ఎస్.పి.ఎస్.ఆర్.నెల్లూరు జిల్లా

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా నెల్లూరు జిల్లా, లింగసముద్రం మండలం, పెద్దపవని గ్రామం నందు ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో పాత భవనములు కొలగించి తీసుకొని పెళ్ళుటకు గాను బహిరంగ వేలం ద్వారా తేది.26-07-2024 న మధ్యాహ్నం 2.00 గంటలకు విక్రయించబడును.

కావున ఆసక్తి కలిగిన వారు షరతులకు లోబడి 2,000/- అప్లికేషన్ కొరకు మరియు 5,000/- డిపాజిట్ కొరకు రెండు వేరు వేరుగా కెనరా బ్యాంకు నందు డిడి రూపంలో, ప్రిన్సిపాల్ APSWRS/JC పెద్దపవని పేరున చెల్లించి తేది.25-07-2024 సాయంత్రం 5.00గంటలలోపు ఈ కార్యాలయం నందు అందజేసి పేరు నమోదు చేసుకోవాల్సిందిగా తెలియపరచడమైనది. మిగిలిన వివరముల కొరకు కార్యాలయం పనివేళల్లో సంప్రదించవలెను. ఫోన్ నెంబర్: 9704550083.

సం/- ప్రిన్సిపాల్

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులం, పెదపవని, ఎస్.పి.ఎస్.ఆర్.నెల్లూరు జిల్లా

అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు

ఉదయగిరి, జూలై 18: ఉదయగిరి, సీతా రామపురం మండలాల్లోని చెరువుల్లో మట్టిని అనుమతి లేనిదే తరలిస్తే చర్యలు తప్పవని డీఈ కందుకూరి చంద్రమౌళి హెచ్చరించారు. గురువారం స్థానిక ఇరిగేషన్ కార్యాలయంలో ట్రాక్టర్ యజమానులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనుమతి లేకుండా చెరువులో మట్టిని తరలిస్తే ట్రాక్టర్‌కు రూ.10వేలు, టిప్పర్‌కు రూ.50వేలు, జేసీబీకి రూ.లక్ష అపరాధ రుసుం విధిస్తామన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గండి పాళెం జలాశయం మరమ్మతులకు రూ.43లక్షలతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామన్నారు. నిధులు మంజూరైతే కుడి, ఎడమ కాలువల తూములకు మరమ్మతులు చేపడతామన్నారు. సీతారామపురం ఊరచెరువు, మర్రి ఊట్ల రిజర్వాయర్ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. వర్షాకాలంను దృష్టిలో ఉంచుకొని చెరువుల కట్టలు, అలుగులు పరిశీలించి చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఏఈలు పాల్గొన్నారు.



ట్రాక్టర్ యజమానులతో మాట్లాడుతున్న ఇరిగేషన్ డీఈ

పరిసరాల శుభ్రతపై అవగాహన ర్యాలీ

సంగం, జూలై 18: వర్షాకాలంలో పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఈవోపీఆర్డీ అప్పాజీ తెలిపారు. గురువారం ఆయన స్థానిక కొత్తూరు పంచాయతీ, క్షేత్రస్థాయి వైద్య సిబ్బందితో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇళ్లలో చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా చెత్త కుండీల్లో, పారిశుధ్య సిబ్బంది వచ్చినప్పుడు వాహనంలో వేయాలని సూచించారు. డయేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, కిషోర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక గురుకుల కళాశాల విద్యార్థినులకు గురువారం వైద్యాధికారి అశోక్ డయేరియాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్యామల, అధ్యాపకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి..

ఉదయగిరి రూరల్, జూలై 18: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఉదయగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి జే.అంజయ్య తెలిపారు. గురువారం బస్టాండ్ సెంటర్ నుంచి కోర్టు వరకు న్యాయవాదులు, పోలీసులు, కోర్టు సిబ్బంది, ప్రజలతో కలిసి హెల్మెట్ ధరించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. న్యాయస్థానాల ఆదేశాల మేరకు ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించి తమ ప్రాణాలను కాపాడుకోవాలన్నారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు రామారావు, మస్తాన్, తిరుపతయ్య, నాగార్జున పాల్గొన్నారు.

మంచినీటి ప్లాంటు పునరుద్ధరణ

ఉదయగిరి, జూలై 18: అప్పసముద్రంలో మూడేళ్లుగా మరమ్మతులకు గురైన మంచినీటి ప్లాంటును గురువారం దాతలు మద్దినేని పృథ్వీచౌదరి, సురభీలు సొంత నిధులతో పునరుద్ధరించారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్, సర్పంచ్ చేజర్ల నాగరత్నమ్మల సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. వారివెంట రమణయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జోరుగా అశ్లీల నృత్యాలు

వరికుంటపాడు, జూలై 18: అలివేలుమంగాపురంలో బుధవారం రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు అశ్లీల నృత్యాలను జోరుగా నిర్వహించారు. గ్రామంలో నిర్వహిస్తున్న పోలేరమ్మతల్లి ఉత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని కొనసాగించినా పట్టించుకోనే నాథుడే కరువయ్యారు. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో నిరంతరంగా ఇలాంటి డ్యాన్సులను కొనసాగించారు. రాత్రి 12గంటల వరకు ఆరుమంది యువతులు సినిమా పాటలకు కుర్రాళ్లతో కలిసి స్టెప్పులు వేశారు. ఆపై మరో నలుగురు యువతులను ప్రత్యేకంగా పిలిపించి ప్రైవేట్ ఆల్బమ్‌లోని అసభ్య పదజాలంతో నిండిన పాటలకు అశ్లీలంగా డ్యాన్సులు వేయించారు. యాంకర్లు సైతం ద్వంద అర్థాలు వచ్చేలా వెకిలి చేష్టలతో మాట్లాడుతూ యువతను ఉత్సాహపరిచారు. ఆ సమయంలో అసహనానికి గురైన కొంతమంది మహిళలు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇటీవల ఆండ్రావారిపల్లి ఎస్సీ కాలనీవాసులు నాగార్పమ్మ ఉత్సవాల సందర్భంగా నిర్వహించే కార్యక్రమానికి అక్కడే కాపుకాచి ఆటంకం సృష్టించిన పోలీసులు ఇతర గ్రామాలపై ఎందుకు మౌనం వహిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

సంగం, జూలై 18: ఆత్మకూరు తూర్పువీధికి చెందిన శివయ్య నెల్లూరు నుంచి ఆత్మకూరుకు వైపు స్కూటీపై వెళ్తుండగా మార్గమధ్యలో కావలి కాలువ వంతెనపై ఉన్న భారీ గుంతలో పడ్డాడు. ఆ సమయంలో వెనుక నుంచి వేగంగా వస్తున్న వ్యాను శివయ్య, స్కూటీపై దూసుకుని ఈడ్చుకుపోయింది. ఈ ప్రమాదంలో శివయ్యకు తీవ్రగాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్ఐ నాగార్జునరెడ్డి వెంటనే సంఘటనా స్థలం వద్దకు వచ్చి గాయపడిన వ్యక్తిని పోలీస్ వాహనంలో వైద్యశాలకు తరలించారు. వ్యాన్‌ను, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు.



గాయపడిన శివయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ జి.వెంకటరమణయ్య

అధికారుల గైర్హాజరుపై ఎంపీపీ ఆగ్రహం

- సమావేశానికి రాని వారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం: ఎంపీడీఓ
- ఆర్‌డబ్ల్యూఎస్, వైద్యశాఖలపై సుదీర్ఘ చర్చ
- సభ్యులు కాని వారు సమావేశహాలులో..
- సీట్లు లేక చెట్ల కింద వేములపాడు సర్పంచ్, పలువురు పంచాయతీ కార్యదర్శులు

జలదంకి, జూలై 19: మండల సర్వసభ్య సమావేశం గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ జి.వెంకటరమణయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ట్రాన్స్‌కో, ఆర్‌అండ్‌బీ, ఆరోగ్యశాఖ తదితర శాఖల అధికారులు గైర్హాజరవడంతో ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతలో ఎంపీడీఓ జోక్యం చేసుకుని సమావేశానికి రాని అధికారులపై మినిట్స్‌లో పొందుపరచి కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడారు. వర్షాకాలం కావడంతో కార్యదర్శులు, ఏఎన్ఎంలు అప్రమత్తమై గ్రామాలలో శానిటేషన్, క్లోరినేషన్ చేయించాలన్నారు. గట్టుపల్లిలో తాగునీటి సమస్యలు ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని వాటిని వెంటనే పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్‌ను ఆదేశించారు. వ్యవసాయశాఖ ద్వారా రైతులకు అందే రాయితీ పచ్చిరొట్ట విత్తనాలు, కౌలురైతు ధ్రువీకరణపత్రాల విషయమై ఏఓ శైలజ సమావేశంలో సభ్యులకు వివరించారు. ఉద్యానవనశాఖ ద్వారా రైతులకు కూరగాయలసాగు, పండ్లతోటల సాగు, నీటికుంటల నిర్మాణం, మినీట్రాక్టర్లు, తైవాన్ స్ప్రేయర్లు రాయితీపై అందివ్వనున్నట్లు వింజమూరు ఉద్యానశాఖ ఏడీ సభ్యులకు వివరించారు. అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందే పౌష్టికాహారం వివరాలను సభ్యులకు వింజమూరు సీడీపీఓ వివరించారు. వైద్యశాఖ ద్వారా రోగులకు అందే సేవల గురించి గట్టుపల్లి పీహెచ్‌సి వైద్యాధికారి సభ్యులకు తెలిపారు. సాగునీటి చెరువుల నీటినిల్వలు, కట్టలు, తూముల పరిస్థితిపై ఏఈ రోజ్‌మేరి వివరించారు. విద్యాశాఖ తరుపున ప్రభుత్వం నుంచి అందే పీఎం పోషణ, విద్యాసరికారాల విషయమై ఎంఈఓ-2 నాగేశ్వరరావు సమావేశంలో చర్చించారు. సమావేశహాలులో సభ్యు లు కాని వారు ముందుగా వచ్చి కుర్చీలలో కూర్చోవడంతో సమావేశహాలు నిండిపోయింది. దీంతో వేములపాడు సర్పంచ్ బి.వి క్రిష్ణారెడ్డి, పలువురు పంచాయతీ కార్యదర్శులు కార్యాలయం బయట చెట్ల కింద వేసిన కుర్చీల్లో కూర్చుని ఉండిపోవాల్సి వచ్చింది. సమావేశంలో వైస్ఎంపీపీ పాలవల్లి మాలకొండారెడ్డి, మేకల ధనమ్మ, తహసీల్దారు వాసు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

● సీనియర్ సివిల్‌జడ్జి శోభారాణి



హెల్మెట్‌పై అవగాహనా కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ సివిల్ జడ్జి శోభారాణి, జూనియర్ సివిల్‌జడ్జి పెళ్లకూరు పూర్ణిమాదేవి

కందుకూరు, జూలై 18: మోటార్ బైకులు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించా లని కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి ఏ శోభారాణి పేర్కొ న్నారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం కందుకూరులో హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెల్మెట్ ధరించి ప్రమాదాల బారిన పడకుండా ఉండాలని, విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పెళ్లకూరు పూర్ణిమాదేవి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించాలి

లింగసముద్రం, జూలై 18: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపీడీఓ కె శ్రీనివాసులు సూచించారు. గురువారం మండలంలోని ముత్యాలపాడు, పెదపవని 1, 2, పెంట్రాల సచివాలయాలను ఎంపీడీఓ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించా రు. అనంతరం ఆయన మాట్లా డుతూ ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని, మంచినీటి ట్యాంకులను శుభ్రపరిచి క్లోరినేషన్ చేయించాలన్నారు. అలాగే సచివాలయ సిబ్బందికి పిఆర్ ఒన్ యాప్, ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనకు సంబంధించి వివరించి, అమలుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన ముత్యాలపాడులోని మంచినీటి ట్యాంకును పరిశీలించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసినఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు

కావలి, జూలై 18: కావలి ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులుగా ఎంపికైన చవల రామకృష్ణ, ఆత్మకూరి నాగలక్ష్మీలు గురువారం సాయంత్రం మునునూరులోని ఎమ్మెల్యే నివాసంలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డిని కలిసి పుష్పగుచ్ఛాలు ధన్యవాదాలు తెలిపారు. తమపై నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి ప్రభుత్వవైద్యశాలలో పేదలకు వైద్యసేవలందేలా చూస్తామన్నారు.

● **వైసీపీ హయాంలో భూదందాలు**

వైసీపీ హయాంలో భూదందాలు, సహజవనరుల దోపిడీకి అడ్డూ అదుపూ లేకుండాపోయిందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి క ప్రకటనలో తెలిపారు. ఈ ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అక్రమాలు, దోపిడీలపై వాస్తవాలను ప్రజలకు తెలియజే సేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్వేత పత్రాలను విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. కావలిలో జగనన్న కాలనీల పేరుతో చేపట్టిన భూసేకరణలో భారీ అవినీతి జరిగిందన్నారు.

ఆల్ మైనార్టీస్ ప్రభుత్వ ఉద్యోగుల రాష్ట్రప్రధాన కార్యదర్శిగా మునీర్‌జాన్

కావలిటౌన్, జూలై 18: ఆంధ్రప్రదేశ్ ఆల్ మైనార్టీస్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా షేక్ మునీర్‌జాన్ నియమితులయ్యారు. విజయవాడ గొల్లపూడిలోని సమాఖ్య కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కె.రజాక్ మునీర్‌జాన్‌కు నియామకపత్రం అందజేశారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్న కావలికి చెందిన మునీర్‌జాన్ మాట్లాడారు.



11కేవీ లైను తెగిపడి రెండు గేదెల మృతి

కొండాపురం, జూలై 18: 11కేవీ లైను తెగిపడి రెండు గేదెలు మృతిచెందిన ఘటన గురువారం తూర్పుఎర్రబల్లిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఉక్కు మాలకొండయ్య తన గేదెలను మేత మేపుకునేందుకు పొలాలకు తోలుకెళ్లాడు. పొలాల్లో 11కేవీ లైను తెగిపడి కింద ఉన్నాయి. వాటిని రెండు గేదెలకు తాకడంతో మృతి చెందాయన్నారు. వీటి విలువ సుమారు రూ.1.30 లక్షలు అన్నారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే ఇలా జరిగిందని ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరారు.

తాగునీటి కోసం ఆందోళన

జలదంకి, జూలై 18: గట్టుపల్లి తూర్పువీధికి రక్షిత మంచినీటి ట్యాంకు ద్వారా కొంతకాలంగా తాగునీరు సరఫరా కావడం లేదని గ్రామస్థులు గురువారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సమస్యపై పలుదఫాలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని వాపోయారు. అనంతరం ఎంపీడీఓ రామచంద్రకు వినతిపత్రం అందజే శారు. సమస్యను జఠిలం అయితే వచ్చే సోమవారం నెల్లూరులోని కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు దమ్ము దర్గాబాబు, దానం రమేష్, మొద్దు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న గట్టుపల్లి గ్రామస్థులు

దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ

కందుకూరు, జూలై 18: సక్షమ్ ఆధ్వర్యంలో కేంద్రప్రభుత్వ సహకారంతో దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం గురువారం కందుకూరులో నిర్వహించారు. పట్టణంలోని కోవూరు రోడ్డులోని స్వర్ణ స్వయంకృషి మానసిక దివ్యాంగుల పాఠశాల వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని ఉపకరణాలను అందజేశారు. ఎనిమిది మందికి బ్యాటరీ ట్రైసైకిల్స్, ఆరుగురికి వినికిడి యంత్రాలు, ఐదుగురికి వీల్‌ఛైర్స్, చంక కర్రలు, హెల్మెట్లు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో కృషిచేస్తోంద న్నారు. కార్యక్రమంలో సక్షమ్ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు చెన్నా రామాంజనేయులు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ గట్టమనేని హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

నేటి నుంచి జనసేన సభ్యత్వ నమోదు

లింగసముద్రం, జూలై 18 : మండలంలో శుక్రవారం నుంచి 28వ తేదీ వరకు జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు జరుగుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు అంగులూరి నరసింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పవన్ కల్యాణ్ అభిమానులు, మెగా అభిమానులు తప్పనిసరిగా భాగస్వామ్యం కావాలని కోరారు. సభ్యత్వ నమోదు కోసం ఫోటో, ఆధార్ నంబరు, ఫోన్ నంబర్, రూ.500 సభ్యత్వ రుసుము చెల్లించాలన్నారు. రెన్యువల్ కోసం రూ.500 చెల్లించాలన్నారు.

● **కలిగిరి:** జనసేన సభ్యత్వ నమోదును గురువారం నియోజకవర్గ సమన్వయకర్త కొట్టే వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో ప్రారంభమైంది. జనసేన మండలాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, నాయకులు నిమ్మలపల్లి రామచైతన్య, రవీంద్ర, కమతం శ్రీనివాసులు, ఆరిమల్ల మల్లికార్జున, సంతోష్, జనసేన వీరమహిళ జిల్లెల్ల నాగలక్ష్మి, నందిపోగు రాజ్‌కుమార్, బండారు చరణ్ పాల్గొన్నారు.

నేడు పెదపవనిలో ఆధార్ సెంటర్ ప్రారంభం

లింగసముద్రం, జూలై 18 : మండలంలోని పెదపవనిలోని ఎస్టీ కాలనీలో శుక్రవారం ఆధార్ కేంద్రాన్ని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభిస్తారని తహసీల్దార్ శ్రీచరణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరి కూడా పాల్గొంటారని ఆయన తెలిపారు.

వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత అవసరం

బిట్రగుంట, జూలై 18: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరప్రాంతాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని కోవూరుపల్లి ఆరోగ్య కేంద్ర వైద్యులు జిహారిక, నిత్యప్రశాంతి తెలిపారు. బోగోలు మండలంలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులతో గురువారం వారు ఆరోగ్య పరిస్థితి, పరిసరప్రాంతాల పరిశీలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్టోర్, వంట, హాస్టల్ గదులతో పాటు భోజనశాలను సందర్శించారు. అనంతరం విద్యార్థుల ఆరోగ్య పరీక్షలు చేసి సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. చేతులు శుభ్రంగా కడుకోవాలని, చర్మవ్యాధులు వాటి లక్షణాలను వివరించారు. కార్యక్ర మంలో కళాశాల అధ్యాపకులు. ఆరోగ్య కేంద్ర సూపర్‌వైజర్ విక్టోరియా, సబ్ యూనిట్ అధికారి లక్ష్మీనరసయ్య, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు

బిట్రగుంట, జూలై 18: బోగోలు మండలంలోని పలు పంచాయతీలో అక్రమ మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థా నికులు వాపోతున్నారు. పాతబిట్రగుంట, కొండబిట్రగుంట, విశ్వనాథరావుపేట, రామ స్వామి పాలెం, కొత్తూరు, తాళ్ళూరు, నాగులవరం, సోమేశ్వరపురం, ఎస్సీపాలెం తదితర గ్రామ పం చాయతీలో అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం. కొన్ని గ్రామాల్లో వేళపాలా లేకుండా కొత్త వ్యక్తులు మద్యం కోసం వస్తున్నట్లు గ్రామస్థులు మండిపడుతున్నారు.

ట్యాక్స్ బకాయిలు చెల్లించని గూడ్స్ వాహనాలు సీజ్ : ఎంవీఐ

కందుకూరు, జూలై 18: కందుకూరు ఎంవీఐ పరిధిలోని వందలాది గూడ్స్ వాహనాల యజమానులు ట్యాక్స్ బకాయిలు ఉన్నారని వారంతా తక్షణం బకాయిలు చెల్లించకుంటే వాహనాలు సీజ్ చేస్తామని ఎంవీఐ ఎస్‌కెఎండీ రఫీ తెలిపారు. కందుకూరు నియోజకవర్గ పరిధిలో 562 గూడ్స్ వాహనాలు, 602 ట్రాక్టర్ ట్రైలర్ పబ్లిక్ వాహనాలు, 56 మ్యాక్సీ క్యాబ్‌ల యజమానులు ట్యాక్స్ బకాయిలు ఉన్నారని తెలిపారు. తరచూ తనిఖీలు నిర్వహించి బకాయిలు ఉన్న వాహనాలు సీజ్ చేయడం జరుగుతుందన్నారు. అలాగే వాహనం ఫిట్నెస్, పర్మిట్ ఇన్సూరెన్స్, పొల్యూ షన్, డ్రైవింగ్ లైసెన్సు లాంటి ధ్రువ పత్రాలు అందు బాటులో ఉంచుకోవాలని సూచించారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎంవీఐ రఫీ

టీచరుకు డాక్టరేట్ ప్రదానం

అల్లూరు, జూలై 18: స్థానిక జిల్లా ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు బంకా శ్రీనివాసులుకు డాక్టరేట్ లభించింది. తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీలో మనోవిజ్ఞాన శాస్త్రం (సైకాలజి) విభాగంలో ప్రొఫెసర్ ఎస్.విశ్వనాథరెడ్డి పర్యవేక్షణలో ఆయన 'కాగ్నిటివ్ స్టూల్స్ ఇన్ రిలేషన్ టు క్రియేటివిటి, మెంట్ హెల్త్ అండ్ అడ్జస్ట్మెంట్ అమాంగ్ హైస్కూల్ స్టూడెంట్స్' అనే అంశంపై పరిశోధన చేసినందుకుగాను డాక్టరేట్ లభించినట్టు ఆ వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఎం.దామ్లానాయక్ తెలిపారన్నారు.



బంకా శ్రీనివాసులు

రైతు సంక్షేమమే తెలుగుదేశం ప్రభుత్వ ధ్యేయం

● కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి


ఇందుకూరుపేట : కౌలు రైతులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

ఇందుకూరుపేట, జూలై 18: రైతు సంక్షేమమే తెలుగుదేశం ప్రభుత్వ ధ్యేయమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మండలంలోని కొత్తూరు ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఏడీఏ రాజ్‌కుమార్, ఏవో రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో కౌలు రైతులకు ధ్రువీకరణ కార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది. వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో కౌలు రైతులు నోటిమాట మీద ఒప్పందం చేసుకుని పంటలను సాగుచేసుకునేవారని, దీనివలన కౌలు రైతులు నష్టపోయేవారన్నారు. అలా జరగకుండా కౌలు రైతులకు సాగు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈపత్రాల వలన వ్యవసాయ శాఖ అందించే ఇన్‌పుట్ సబ్సిడీ విత్తనాలు, పంటసాయం కింద అందించే రైతు భరోసా నిధులు అందుతాయని తెలిపారు. ప్రకృతి విపత్తుల వల్ల నష్టం వాటిల్లినప్పుడు ఈ కార్డు ద్వారా పంట నష్టం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో దువ్వూరు కల్యాణ్‌రెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, రావెళ్ల వీరేంద్రచౌదరి, చెంచుకిషోర్‌యాదవ్, మునగాల రంగారావు, అవ్వారు ఏడుకొండలు, కైలాసం ఆదిశేషారెడ్డి, బీజేపీ నాయకులు కైలాసం శ్రీనివాసులురెడ్డి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం: ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు పంటనష్టం వాటిల్లిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే పలు రకాల ఇన్సూరెన్సులు పొందేందుకే కౌలురైతు కార్డులు అందజేస్తోందని మండల వ్యవసాయాధికారి ఎం సురేంద్రరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని చెల్లాయపాళెం, కాగులపాడు గ్రామాల్లో కౌలురైతులతో సమావేశం ఏర్పాటుచేసి కౌలురైతు కార్డులపై అవగాహన కల్పించారు. తద్వారా సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పొందే విధానంపై అవగాహన కల్పించారు. పలువురు కౌలు రైతులకు కౌలు రైతు కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల వీఆర్వోలు, వీఏఏ కళ్యాణి రైతులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలి



కోవూరులో న్యాయవాదుల, కోర్టు సిబ్బంది ప్రదర్శన

కోవూరు, జూలై 18: మోటారుబైక్‌లు నడిపే వారందరూ విధిగా హెల్మెట్ ధరించాలని మేజిస్ట్రేట్ కాత్యాయిని సూచించారు. స్థానిక కోర్టు భవనాల సముదాయం నుంచి బజారు కూడలి వరకు గురువారం న్యాయవాదులు, కోర్టుసిబ్బంది ప్రదర్శన చేపట్టారు. లీగల్ సర్వీసెస్ అథారిటీ చేపట్టిన ఈ ప్రదర్శనలో స్పెషల్ మేజిస్ట్రేట్ కృష్ణయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సలీమ్, బాబు, సీనియర్ న్యాయవాదులు, లీగల్ సర్వీసెస్ అథారిటీ సూపరిండెంటు గంగాధర్, మేజిస్ట్రేట్ కోర్టు సూపరిండెంటు రవి తదితరులు పాల్గొన్నారు.

వరవ కాలువ పనుల పరిశీలన

పొదలకూరు, జూలై 18: మండలంలోని కనుపర్తి గ్రామ చెరువు వరవ కాలువ పనులను డ్వామా ఇన్‌చార్జ్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిందు, తుంపర్ల సేద్యానికి అవసరమైన పరికరాలు అవసరమైన వారు రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని కోరారు. ఆయన వెంట పొదలకూరు ఏపీవో మధుసూదన్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సాయి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్యశిబిరం

వెంకటాచలం, జూలై 18: మండలంలోని నిడిగుంటపాళెంలో గురువారం నెల్లూరుకు చెందిన నారాయణ దంతవైద్యశాల వారి సహకారంతో తెలుగురైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావూరి రాధాకృష్ణమనాయుడు, టీడీపీ సీనియర్ మండల నేతలు రావూరి పద్మనాభనాయుడు, బీ చైతన్యరెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు కుంచి శ్రీనివాసులు యాదవ్ ఆధ్వర్యంలో ఉచిత దంతవైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా నారాయణ దంతవైద్యశాల వైద్య నిపుణులు ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నారాయణ దంతవైద్యశాల సిబ్బంది, టీడీపీ, బీజేపీ నేతలు, పాల్గొన్నారు.

● గొట్లపాళెంలో పశువైద్యశిబిరం

మండలంలోని తిక్కవరప్పాడు పంచాయతీ గొట్లపాళెంలో గురువారం స్వర్ణభారత్ ట్రస్ట్, మండవ ఫౌండేషన్, పశుసంవర్ధకశాఖ సంయుక్తంగా పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటాచలం పశువైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, మండవ ఫౌండేషన్ పశువైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులు నాయుడు పశువులకు చికిత్స, దూడలకు నట్టల నివారణ మందులు వేశారు. కార్యక్రమంలో టీ శ్రావణ్‌కుమార్, పాడిరైతులు పాల్గొన్నారు.

సందర్శకులతో సాగర తీరం కిటకిట

తోటపల్లిగూడూరు, జూలై 18: రొట్టెల పండుగని పురస్కరించుకుని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన సందర్శకులతో కోడూరు సాగరతీరం గురువారం కిటకిటలాడింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ జంపానీకుమార్, సిబ్బందితో కలిసి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎవరూ సముద్రం లోతుకు వెళ్లకూడదని హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేశారు.

భూమిలోని పోషకాలపై అవగాహన

విడవలూరు, జూలై 18: భూమిలోని పోషకాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఆత్మ పథకం పీడీ దొరసాని తెలిపారు. విడవలూరు, అలగానిపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు, ఉపాధ్యాయులకుభూమిలోని పోషకాలు, వాటి ఉపయోగాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమంలో వ్యవసాయాధికారులు కన్నయ్య, అనూష, కల్యాణ్, వెంకటకిష్టయ్య పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ

తోటపల్లిగూడూరు, జూలై 18: ఆర్‌వీ కండ్రిక పాఠశాలకు గురువారం మండల విద్యా శాఖాధికారి-1 ఎస్ వేణుగోపాల్‌రెడ్డి, విద్యాశాఖాధికారి-2 డి జయరామ నాయుడు అధ్యక్షతన ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ వారి సహకారంతో 30 మామిడి చెట్లు, 10 నిమ్మ చెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు ఎన్ నారాయణ, ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఎన్ బలరామయ్యనాయుడు, రామమోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అక్రమార్కులపై కఠిన చర్యలు తప్పవు

● సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి


విలేకరుల సమావేశంలో లేఅవుట్ పత్రాలు చూపి మాట్లాడుతున్న సోమిరెడ్డి

పొదలకూరు, జూలై 18: మాజీ మంత్రి కాకాణి ఇలాకాలో అడ్డగోలుగా అక్రమ లేఅవుట్లు వెలిశాయని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గంలో మాజీ మంత్రి కాకాణి హయాంలో వెలిసిన ఏ ఒక్క లే అవుట్ సక్రమంగా లేదని అన్నారు. పొదలకూరులోని ఒక్క స్వర్ణ లే అవుట్‌లో భారీ అవకతవకలు జరిగాయని, సుమారు రూ.200 కోట్ల వరకు వ్యాపారాలు జరిగాయని తెలిపారు. అక్రమ లే అవుట్లపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, పట్టణాధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున్‌నాయుడు, కలిచేటి ప్రభాకర్‌రెడ్డి, పులిపాటి వెంకటరత్నంనాయుడు, కోవూరు బక్కయ్యనాయుడు, మండల మహిళా అధ్యక్షురాలు ఆదాల సుగుణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కోర్టు స్టే ఉన్న భూముల్లో ప్రవేశిస్తే చట్టరీత్యా నేరం

● పనులను అడ్డుకున్న వీఆర్‌వోలు

మనుబోలు, జూలై 18: కోర్టు స్టే ఇచ్చిన భూముల్లో ప్రవేశిస్తే చట్టరీత్యా నేరమని తహసీల్దార్ చిరంజీవి అన్నారు. మనుబోలు రెవెన్యూ పరిధిలోని సర్వే నెం. 23-2లో 3ఎ-66 సెంట్ల స్థలంలో గురువారం కొంతమంది ప్రవేశించి చదునుచేసే పనులు మొదలుపెట్టారు .విషయం తెలుసుకున్న మనుబోలు, చెర్లోపల్లి విఆర్‌వోలు నాగార్జునరెడ్డి, వెంకయ్యలు భూమి వద్దకు వెళ్ళి పనులను అడ్డుకున్నారు. అనంతరం తహసీల్దార్ చిరంజీవి భూముల్లోకి దిగవద్దంటూ వారిని హెచ్చరించారు. సదరు భూమిపై కొద్ది సంవత్సరాలుగా వివాదం నెలకొంది. దీనిపై కోర్టులో కేసు నడుస్తోంది. అయితే 2020లో ఇదే భూమిలో జగనన్న లేఅవుట్ వేశారు. అప్పుడు కోర్టు వివాదంలో ఉన్న భూమిలో లేఅవుట్ ఎలా వేస్తారంటూ కోర్టులో పిల్ వేశారు. దీంతో లేఅవుట్‌లోని స్థలాలను లబ్ధిదారులకు పంపిణీ చేయలేదు. అయితే ఈ లేఅవుట్ ద్వారా రూ. 40లక్షల పనులు చేసినట్లు రికార్డులు చూపుతున్నాయి.

గ్రామాల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం


చంద్రబాబు, పవన్‌కల్యాణ్, సోమిరెడ్డి ఫోటోలను ఆవిష్కరించిన టీడీపీ నాయకులు

తోటపల్లిగూడూరు, జూలై 18: గ్రామాల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం అని పాపిరెడ్డిపాలెం టీడీపీ నాయకులు పేర్కొన్నారు. గురువారం పాపిరెడ్డిపాలెం సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పిలుపు మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ చిత్రపటాలను ఉపసర్పంచ్ మేనాటి సీనయ్య ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దద్దోలు మనోహర్, పరుచూరి హరిబాబు, కరివేటి సుధాకర్‌రెడ్డి, వేమారెడ్డి శ్రీనివాసులురెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, వీర్‌వో సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మా స్థలాలు మాకు ఇప్పించండి

● తహసీల్దారుకు గిరిజనుల మొర


తహసీల్దారు కార్యాలయం ఎదుట ఇంటి పట్టాలతో నిరసన చేస్తున్న గిరిజనులు

తోటపల్లిగూడూరు, జూలై 18: జగనన్న గృహ నిర్మాణాలలో అవినీతి జరిగిందని, మా స్థలాలు మాకు ఇప్పించాలని మల్లికార్జునపురం గిరిజనులు తహసీల్దారు మాధవరెడ్డికి గురువారం మొరపెట్టుకున్నారు. ఇంటి పట్టా ఉంది కానీ స్థలం లేదు, మరొకరికి స్థలం ఉంది కానీ ఇల్లు వాళ్లది కాదు, ఇల్లు ఉంది కానీ వాళ్లకు పట్టా లేదు. గృహ నిర్మాణం జరగకుండానే కొన్ని ఇళ్లకు రూ.90వేలు నిధులు విడుదల చేశారు. గిరిజనులు వెళ్లి గృహ నిర్మాణ శాఖ అధికారులను అడిగితే బెదిరింపులకు దిగుతున్నారని తహసీల్దారుకు గిరిజనులు మొర పెట్టుకున్నారు. గృహ నిర్మాణ కాంట్రాక్టర్ తమను అన్ని రకాలుగా దగా చేశారని, ప్రధానంగా ప్లాట్లు పట్టా ఒకరి పేరుతో, ఇల్లు మరొకరి పేరుతో, అదేవిధంగా ప్లాట్లు ఇప్పిస్తానని అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేశారని, లబ్ధిదారుల ఏటీఎం కార్డులు తన వద్ద ఉంచుకుని లబ్ధిదారుల నుంచి పనులు పూర్తిచేయకుండా దాదాపు రూ.13లక్షలకు పైగా స్వాహా చేశారని బాధితులు తెలిపారు.





విడవలూరులో ఏరులై పారుతున్న మద్యం

విడవలూరు, జూలై 18: మండలంలో మద్యం ఏరులై పారుతోంది. పార్లపల్లి, విడవలూరు, వీరారెడ్డిపాళెం, రామతీర్థం, అలగానిపాడు, దంపూరు, చౌకిచర్ల, ముదివర్తి గ్రామాల్లో బెల్టుషాపులు మూడు పువ్వులు, ఆరుకాయలుగా విరాజిల్లుతున్నాయి. ఈ గ్రామాల్లోని కొందరు సిండికేట్ అయ్యి ఓ వైసీపీ నేత కనుసన్నల్లో బెల్టుషాపులు నిర్వహిస్తూ అధిక ధరకు విక్రయిస్తున్నారు. సంబంధిత అధికారులకు నెలమామూళ్లు అందజేస్తూ బెల్టుషాపులపై దాడులు జరిగితే అలగానిపాడు గ్రామానికి చెందిన వైసీపీ నేత స్టేషన్లలో మధ్యస్థాలు చేసి వారిని విడిపించటం జరుగుతోంది. దీంతో అధికారులు ఆనేత చెప్పినట్లు నడుచుకోవడం అనవాయితీగా మారిందన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

బెల్టుషాపులు అరికట్టాలి

గిరిజన, దళిత కాలనీల్లో బెల్టు షాపులు ఉండడంతో తమ భర్తలు మద్యానికి బానిసలై రోజంతా కష్టపడి సంపాదించిన సొమ్ముతో మద్యం మత్తులో మునిగి తేలుతున్నారని, దీంతో కుటుంబ పోషణ జరక్క పస్తులు ఉండాల్సి వస్తోందని మహిళలు వాపోతున్నారు. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి చొరవ తీసుకుని బెల్టుషాపులను అరికట్టాలని, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి బెల్టుషాపుల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సమాచారం ఇస్తే చర్యలు : సురేంద్రబాబు, ఎక్సైజ్ ఎస్ఐ

బెల్టుషాపులు నిర్వహిస్తున్నట్లు ప్రజలు సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటాము. గ్రామాల్లో బెల్టు షాపులను సాధ్యమైనంత వరకు అరికడుతున్నాము.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

ఆర్టీసీ బస్టాండ్లలో దోచేస్తున్నారు!

- దుకాణాల్లో ఎమ్మార్పీపై రూ.5, రూ.10 అధికం
- రొట్టెల పండుగకు వస్తున్న ప్రయాణికులే టార్గెట్
- నిషేధిత వస్తువులకు అడ్డాగా..


ఆర్టీసీ బస్టాండుల్లోని దుకాణాలు



ఎమ్మార్పీకే విక్రయించాలని ఏర్పాటు చేసిన బోర్డు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 18: రొట్టెల పండుగతో నగరం లోని ఆర్టీసీ బస్టాండుల్లో ప్రయాణికుల రద్దీ అధికంగా ఉంది. ఈ క్రమంలో ఓ ప్రయాణికుడు బస్టాండులోని ఓ దుకాణం వద్దకు వెళ్లి ఓ వాటర్ బాటిల్ ఇవ్వాలని కోరగా రూ.25 ఇవ్వాలని దుకాణంలోని సిబ్బంది చెప్పడంతో ఆ ప్రయాణికుడు అదేంటి వాటర్ బాటిల్ రూ.20లే కదా.. అందులోనూ బ్రాండ్ వాటర్ బాటిల్ కూడా కాదు అన్నాడు. మా వద్ద అంతేనండి.. నచ్చితే కొనండి.. లేకుంటే వెళ్లండంటూ విసుక్కున్నాడు. ఆ ప్రయాణికుడు మరో దుకాణం వద్దకు వెళ్లి వాటర్ బాటిల్ అడిగాడు.. అక్కడా అదే సమాధానం, ఇలా అన్ని దుకాణాల్లో అదే పరిస్థితి. అప్పుడు అర్థమైంది ఆ ప్రయాణికుడుకు ఇక్కడ అందరూ సిండికేట్ అయి అధిక ధరలకు వస్తువులు విక్రయిస్తున్నారని. చేసేది లేక వారు చెప్పిన ధరకే వాటర్ బాటిల్ కొనుగోలు చేశాడు. ఇలా రోజూ వేలాది మంది ప్రయాణికులు బస్టాండుల్లోని దుకాణాల్లో వస్తువులను అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు.

● రొట్టెల పండుగ కోసం నెల్లూరు నగరానికి లక్షలాది మంది ప్రజలు తరలి వస్తున్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సుల ద్వారా నగరంలోని ఆర్టీసీ బస్టాండ్లకు చేరుకుంటున్న ప్రజలనే టార్గెట్ చేస్తూ స్టాల్స్ యాజమాన్యం దోచేస్తున్నారు. నగరంలోని ప్రధాన ఆర్టీసీ బస్టాండుతో పాటు ఆత్మకూరు బస్టాండుల్లోని స్టాల్స్‌లో కూల్‌డ్రింక్స్ తినుబండారాలు, భోజనాలు, టిఫిన్, ఫ్రైడ్‌రైస్ ఇలా అన్ని వస్తువులకు ఒక్కసారిగా రెక్కలు వచ్చాయి. ఎమ్మార్పీ కంటే రూ.5 నుంచి 10 రూపాయలు అదనంగా వసూలు చేస్తూ ప్రయాణికులను దోచేస్తున్నారు. ఇదెక్కడి న్యాయం అంటూ ఎవరైన ప్రశ్నిస్తే దిక్కున్న చోట చెప్పుకో అంటూ బెదిరిస్తున్నారు. మరో దుకాణంలో కొందామంటే అన్ని దుకాణాల్లోనూ ఒకే ధర ఉండటంతో చేసేది లేక ప్రయాణికులు దోపిడీకి గురవుతున్నారు. ఇంత జరుగుతున్నా ఆర్టీసీ అధికారులు, విజిలెన్స్ అధికారులు, సిబ్బంది మాత్రం ఆవైపు కన్నెతి చూడటం లేదు.

● ఆర్టీసీ బస్టాండుల్లో ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయించకూడదన్న బోర్డులు దిష్టి బొమ్మలా కన్పిస్తూనే ఉంటాయి. అయితే ప్రతి దుకాణంలోనూ అధిక ధరకే విక్రయాలు సాగిస్తుంటారు. ఈ విషయాలు అధికారులకు, బస్ స్టేషన్ మేనేజర్‌కు తెలియనట్లు నటిస్తుంటారు. ఆర్టీసీ బస్టాండుల్లోని స్టాల్స్‌లో ఎమ్మార్పీ అమలు కావడం లేదని పలుమార్లు కథనాలు రాసినా, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించడం లేదు. ప్రధానంగా బస్టాండుల్లోని హోటల్స్, టిఫెన్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లలో నాణ్యతపై పూర్తిగా దృష్టి సారించడం లేదని, ధరలు మాత్రం ఇష్టానుసారంగా తీసుకుంటున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు దృష్టి సారిస్తే నాణ్యత, శుభ్రతపై అనేక విషయాలు వెలుగులోకి వస్తాయని ప్రజలు కోరుతున్నారు.

నిషేధిత వస్తువులకు అడ్డాగా...

ఆర్టీసీ బస్టాండుల్లోని దుకాణాల్లో సిగిరెట్లు, గుట్కాలు వంటివి అమ్మకూడదన్న నిబంధనలు ఉన్నాయి. అయితే ఆ వస్తువులకు అడ్డాగా దుకాణాలు మారుతున్నాయి. బస్టాండులో సిగిరెట్లు, గుట్కా, మానిక్‌చంద్, ఇలా చెప్పుకుంటూ పోతే మద్యం వరకు బస్టాండుల్లోని దుకాణాల్లో దొరుకుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఏదేమైనా ఆర్టీసీ బస్టాండుల్లోని దుకాణ దారులు ప్రయాణికులను జలగల్లా పీల్చేస్తున్నారు. ఈ విషయాలన్నీ ఆర్టీసీ అధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో మాముళ్ల మత్తులో కూరుకుపోయారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జనసేన సభ్యత్వంతో ప్రమాద, జీవిత బీమా


సభ్యత్వ నమోదును కిట్లు అందిస్తున్న సుజయ్‌బాబు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 18: జన సైనికులకు, వీర మహిళలకు భరోసా కల్పించడమే ధ్యేయంగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ క్రియాశీలక సభ్యత్వంతో పాటు ప్రమాద, జీవిత బీమా అందిస్తున్నారని జనసేన పార్టీ నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు పేర్కొన్నారు. జనసేన పార్టీ నగర కార్యాలయంలో గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నగర వ్యాప్తంగా క్రియాశీలక సభ్యత్వాలు అధికంగా చేసేందుకు నాయకులకు ప్రత్యేక గొడుగులు, పుస్తకాలు, పవన్‌కల్యాణ్ మనోగతం పుస్తకం, వెండి జ్ఞాపిక, వారాహి అమ్మ వారి బొమ్మను అందజేశారు. జనసేనపార్టీ క్రియా శీలక సభ్యత్వం రూ.500 చెల్లించి పొందవచ్చ న్నారు. నెల్లూరు నగరం, రూరల్‌లో 30 వేలకు పైగా సభ్యత్వాలు లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నగర, రూరల్ డివిజన్ ఇంచార్జులు పాల్గొన్నారు.

● మహా యజ్ఞంలా...

జనసేన పార్టీ క్రియా శీలక సభ్యత్వ నమోదు కార్యక్రమంలో రాష్ట్రంలోనే జిల్లా ముందంజలో ఉండేలా క్షేత్రస్థాయిలో కార్యకర్తలు మహా యజ్ఞంలా చేయాలని జనసేన పార్టీ నాయకుడు నూనె మల్లికార్జున యాదవ్ పిలుపునిచ్చారు. నగరంలోని గోమతి నగర్‌లో ఉన్న జిల్లా జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు జనసేన పార్టీ క్రియా శీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జిల్లాలో భారీ సంఖ్యలో చేపట్టాలని పిలుపునిచ్చారు. జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 28వ తేదీ వరకు సభ్యత్వ నమోదు జరుగుతుందన్నారు. సభ్యత్వానికి ఒక ఫొటో, ఫోన్ నెంబర్, ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డును అందిస్తే సరిపోతుందన్నారు. సభత్వం తీసుకున్న వారికి ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు హాస్పిటలైజేషన్‌కు రూ.50 వేలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షలు ఇన్సూరెన్స్ లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జమీర్, శ్రీరామ్, కృష్ణారెడ్డి, నాగరత్నం యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఫరూక్‌ను కలిసిన బీద



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 18: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ.ఫరూఖ్‌ను గురువారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అనేక విషయాలు మంత్రితో చర్చించిన ఆయన నెల్లూరు జిల్లా పర్యటనకు రావాలని ఆహ్వానించారు.

చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్ మృతి

నెల్లూరు (క్రైం), జూలై 18: ఆటోను బైక్ ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆటోడ్రైవర్ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. దొంతలి గ్రామానికి చెందిన టి సుబ్బరాయుడు(50) ఈ నెల 17వ తేదీ సాయంత్రం ఆటోలో స్వగ్రామానికి వెళుతుండగా ఓ బైక్ ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయన జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. సౌత్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

రొట్టెల పండుగ భక్తుల సేవలో రక్తదాతలు


రక్తదానం చేస్తున్న యువత

నెల్లూరు (సిటీ), జూలై 18 : ఆపద సమయాల్లో ప్రాణాలను నిలబెట్టే రక్తదాతలు నేను సైతమంటూ నెల్లూరులోని బారాషహీద్ దర్గా వద్ద రొట్టెల పండుగకు హాజరైన భక్తుల సేవలో నిలిచారు. పలు ప్రాంతాల నుంచి భారీగా తరలివస్తున్న భక్తులకు ఆరోగ్యపరంగా అండగా నిలిచేందుకు రెడ్‌క్రాస్, నోవ, జీజీహెచ్ బ్లడ్‌బ్యాంకులు శిబిరాలు ఏర్పాటు చేశారు. దర్గా ఎదురు నెల్లూరు క్లబ్‌లో వీటిని అందుబాటులో ఉంచిన నిర్వాహకులు వేడుకకు వచ్చిన యువత నుంచి రక్తదానాల వైపు అవగాహన కల్పిస్తున్నారు. అదే సమయంలో అత్యవసరమైన వారికి రక్త నిల్వలను అందుబాటులో ఉంచారు. దర్గా వేడుకలకు వచ్చిన భక్తులు రక్తదానం చేయాలనుకుంటే క్లబ్‌లోని శిబిరాలను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

భక్తుల కోసం మూడు బోట్లు సిద్ధం


బోటు షికారు చేస్తున్న భక్తులు

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 18 : బారాషహీద్ దర్గా రొట్టెల పండుగకు తరలివచ్చే భక్తులు బోట్ షికారు చేసేందుకు 3 బోట్లను సిద్ధం చేశామని ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ డివిజనల్ మేనేజర్ సీహెచ్ శ్రీనివాసరావు గురువారం తెలిపారు. స్వర్ణాల చెరువు వద్ద గల బోట్ క్లబ్‌లో నగరవాసులకు 365 రోజులు బోట్ షికారు చేసేందుకు 3 బోట్లు ఉన్నాయన్నారు. అలాగే రొట్టెల పండుగకు వచ్చిన భక్తులు, రొట్టెలు పట్టుకున్న తర్వాత బోట్ షికారులో సేదతీరుతున్నారని తెలిపారు. పండుగ దృష్ట్యా విజయవాడ నుంచి 30 మంది అదనపు సిబ్బందిని తీసుకొచ్చామని తెలిపారు. భక్తుల కోసం ఫుడ్‌కోర్టు కూడా ఏర్పాటు చేశామన్నారు. రొట్టెల పండుగ ప్రారంభమైన రెండు రోజులకుగాను బోట్ షికారు ద్వారా దాదాపు రూ.3లక్షలు వచ్చిందన్నారు. భక్తుల భద్రత కోసం ఇన్సూరెన్స్, సేఫ్టీ జాకెట్లతోపాటు అన్ని రకాల అనుమతులతో బోట్లను తిప్పుతున్నామన్నారు.

వివాహం చేసుకుంటానని.. నగదు దోచేసి..

● మోసగాడిపై పోలీసు కేసు నమోదు

నెల్లూరు(క్రైం), జూలై 18: ఒంటరిగా ఉన్న మహిళ ను వివాహం చేసుకుంటానని నమ్మించి నగదు దోచేసిన ఘటనలో నిందితుడిపై గురువారం బాలాజీ నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. బాలాజీనగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని శ్రీహరినగర్‌కు చెందిన ఓ మహిళ కుటుంబకలహాల నేపథ్యంలో భర్త నుంచి విడిపోయింది. తన కుమారుడితో కలిసి ఒంటరిగా జీవిస్తోంది. ఈ నేపథ్యంలో 2014లో ఆమెకు వెంకటాచల సత్రం మండలం కంటేపల్లికి చెందిన మనోజ్‌కుమార్‌తో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో మనోజ్‌కుమార్ తనకు ఇంకా వివాహం కాలేదని, నిన్ను వివాహం చేసుకుంటా నని ఆ మహిళను నమ్మించి లోబర్చుకున్నాడు. ఆమె వద్ద పలు దఫాలుగా రూ.17 లక్షల తీసుకున్నాడు. వావాహం చేసుకోమని మహిళ అతనిని నిలదీయగా కాలయాపన చేస్తూ వచ్చాడు. ఈ నేపథ్యంలో అతని గురించి ఆరాతీయగా మనోజ్‌కుమార్‌కు ఇదివరకే వివాహమైనట్లు తెలిసింది. దీంతో మహిళ అతన్ని నిలదీయగా కులం పేరుతో దూషించడంతో పాటు చంపుతానని బెదిరించసాగాడు. ఈ మేరకు బాధిత మహిళ బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ లాయర్‌పై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), జూలై 18: లాయర్‌నని నమ్మించి ఓ వ్యక్తి నుంచి నగదు కాజేసిన నకిలీ లాయర్‌పై బాలాజీనగర్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఏసీ నగర్‌కు చెందిన ఎం.శ్రీనివాసరావు ఓ రియల్‌ఎస్టేట్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేశారు. కంపెనీ నుంచి ఆయనకు జీతం, ఇన్సెంటివ్ నగదు ఇవ్వాల్సి ఉండగా ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారు. ఈ విషయం తెలుసుకున్న నాగేశ్వరరావు అనే వ్యక్తి తాను లాయర్‌నని శ్రీనివాసరావుతో పరిచయం చేసుకున్నాడు. రియల్‌ఎస్టేట్ కంపెనీ నుంచి రావాల్సిన నగదు ఇప్పిస్తానని నమ్మించి పలు దఫాలుగా రూ.1.15 లక్షల తీసుకున్నారు. రోజులు గడుస్తున్నా కంపెనీ నుంచి నగదు ఇప్పించకపోవడంతో బాధితుడు నాగేశ్వరరావు గురించి ఆరాతీయగా అసలు అతను లాయర్ కాదని తేలింది. దీంతో మోసపోయానని గుర్తించి బాధితుడు బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రాజరాజేశ్వరికి నేడు శాకాంబరి అలంకారం

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 18: స్థానిక రాజరాజేశ్వరి ఆలయంలో ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాజరాజేశ్వరి అమ్మవారికి శాకాంబరి అలంకారం చేపడుతున్నట్లు ఆలయ చైర్మన్ రత్నంజయరామ్, సహాయ కమిషనర్ బీ.వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అలంకారానికి ఉభయకర్తలుగా కొలపర్తి రమేష్‌కుమార్, సువర్ణలక్ష్మిలు వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఈ సీజన్‌లో వివిధ ప్రాంతాల్లో లభించే పండ్లు, కూరగాయలు, డ్రైఫ్రూట్స్‌తో అమ్మవారితో పాటు ఆలయ ప్రాంగణం అంతా అలంకరించడం జరుగుతుందని పేర్కొన్నారు. శాకాంబరిదేవీ రూపంలో ఉన్న రాజరాజేశ్వరి అమ్మవారిని దర్శించుకుంటే సౌభాగ్యంలు, ఐశ్వర్యంలతోపాటు సంపూర్ణ ఆయురారోగ్యాలు కలుగుతాయని, భక్తులు అందరూ తరలిరావాలని కోరారు.

నేడు న్యాయవాదులు కోర్టు విధుల బహిష్కరణ

నెల్లూరు(లీగల్), జూలై 18: విధి నిర్వహణలో ఉన్న బెజవాడ బార్ అసోసియేషన్‌కు చెందిన ముగ్గురు న్యాయవాదులపై కొంతమంది దాడికి పాల్పడడాన్ని ఖండిస్తూ నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం కోర్టు విధులను బహిష్కరించి తమ నిరసనను తెలియజేయాలని బార్ కమిటీ తీర్మానించింది. ఈ మేరకు నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీ.ఉమామహేశ్వర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరి ఎస్‌పీఎల్ వరప్రసాద్ రావు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి న్యాయమూర్తులు, న్యాయవాదులు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్‌ను సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం - 9985411424

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.
తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట : 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు : 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు : 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి : 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు : 99890 59755



రక్తపు మరకల నడుమ జయలక్ష్మి మృతదేహం

ప్రేమోన్మాదం

- గంజాయికి బానిసైన యువకుడి ఘాతుకం
- మూడేళ్ళుగా బాలిక వెంటబడి వేధింపులు
- అవ్వ మందలింపులతో కక్ష పెంచుకున్న వైనం
- వృద్ధురాలి గొంతుకోసి....మనవరాళ్ళపై ఇనుప రాడ్‌తో దాడి చేసి పరార్



స్కూటీపై పరారవుతున్న శ్రీనివాస్



మృతురాలు జయలక్ష్మి (ఫైల్‌ఫొటో)



కన్నీరుమున్నీరవుతున్న జయలక్ష్మి కుమారుడు శ్రీనివాసులు తదితరులు

తిరుపతి(నేరవిభాగం), జులై 18 : గంజాయి మత్తుకు బానిసైన ఓ జులాయి విచక్షణ కోల్పోయాడు.మూడేళ్లుగా వెంటబడి తిరిగినా తన ప్రేమను తిరస్కరించిందన్న కోపంతో ఆ యువతి కుటుంబంపై పగబట్టాడు. గురువారం చీకటిబడ్డాక ముఖానికి మాస్క్, తలకు టోపీ ధరించి వారింట్లో దూరాడు.ప్రేమ విషయంలో మందలించిందన్న కోపంతో ఆ యువతి నాయనమ్మ గొంతుకోసి చంపేశాడు.తరువాత ఆమె చెల్లెలి తలపై ఇనుప రాడ్‌తో మోది తీవ్రంగా గాయపరిచాడు. అనంతరం మెట్లమీద ఎదురుపడిన ఆ యువతిపై కూడా ఇనుప రాడ్‌తో దాడి చేసి పరారయ్యాడు. తిరుపతి రాయల్‌నగర్‌లో గురువారం సాయంత్రం చోటు చేసుకున్న ఈ ఘటన నగరవాసులను తీవ్ర ఆందోళనకు గురిచేసింది.పోలీసుల కథనం మేరకు... తిరుపతి రాయల్‌నగర్‌లో కాపురమున్న శ్రీనివాసులు బసవయ్య అండ్ కో పేరుతో శానిటరీ మార్ట్ దుకాణాలు నిర్వహిస్తున్నాడు.రోజూ శ్రీనివాసులు తన భార్య రక్షతో కలసి దుకాణానికి వెళ్ళేవాడు. శ్రీనివాసులు ఇద్దరు కుమార్తెల్లో పెద్ద కుమార్తె ప్రేరణ(18) డిల్లీలో బీబీఏ చదువుతోంది. చిన్న కుమార్తె నియతి(14) ఇక్కడే 9వ తరగతి చదువుకుంటోంది.శ్రీనివాసులు ఇంటి ముందు కాపురమున్న తాపీ మేస్త్రీ నరసింహులు రెండవ కుమారుడు శ్రీనివాస్ తరచూ ప్రేరణను ప్రేమ పేరుతో వెంటబడి వేధించేవాడు.ఈ విషయమై ఆమె నాయనమ్మ జయలక్ష్మి (67) పలు సందర్భాల్లో అతడిని మందలించిందని సమాచారం. సెలవులు కావడంతో ఇటీవల ప్రేరణ తిరుపతికి వచ్చింది. దీంతో శ్రీనివాసులు ఆమెను తరచూ మానసికంగా వేధించడం ఎక్కువైంది.ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం ప్రేరణ తన తల్లి రక్షతో కలిసి డ్రైవింగ్ నేర్చుకోవడం కోసం బయటకు వెళ్ళారు.చీకటిబడ్డాక శ్రీనివాస్ తలపై టోపీ, ముఖానికి మాస్కు ధరించి ఎదురింట్లో దూరాడు. సెకండ్ ఫ్లోర్‌లో వున్న జయలక్ష్మి దగ్గరకు వెళ్లి కిరాతకంగా గొంతు కోసి హతమార్చాడు.ఆపై ఫస్ట్ ఫ్లోర్‌కు వచ్చి అక్కడున్న నియతిని తలపై ఇనుప రాడ్‌తో మోది తీవ్రంగా గాయపరిచాడు.దీంతో ఆమె అక్కడికక్కడే స్పృహ తప్పి పడిపోయింది. గ్రౌండ్ ఫ్లోర్‌కు దిగుతుండగా బయట్నుంచి వస్తున్న ప్రేరణ మెట్లమీద ఎదురుపడడంతో ఆమెపై కూడా ఇనుప రాడ్‌తో దాడి చేశాడు. ఆమె తల్లి వద్ద స్కూటీ తాళాలు లాక్కున్న శ్రీనివాస్ కింద ఇంటి ముంగిట పార్కు చేసి వున్న బాధితుల స్కూటీలోనే పరారయ్యాడు.తీవ్రంగా గాయపడిన నియతి పరిస్థితి విషమంగా వుండడంతో ఆమెను ఎలైట్ ఆస్పత్రికి తరలించారు. స్వల్పంగా గాయపడ్డ ప్రేరణను కూడా ఆస్పత్రిలో చేర్చారు.ఈ ఘటనకు సంబంధించిన సమాచారం అందగానే ఎస్పీ సుబ్బరాయుడు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు.డీఎస్పీ రవిమనోహరాచారి,సీఐలు మురళీమోహనరావు, జయనాయక్ ఘటనా స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేపట్టారు.డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌లు కూడా అక్కడికి చేరుకుని వివరాలు సేకరించే పనిలో పడ్డాయి.డాగ్ స్క్వాడ్ బాధితుల ఇంటి ముందు కాపురమున్న నరసింహులు ఇంటి వద్దకు వెళ్ళి ఆగిపోయింది. దీంతో పోలీసులు బాధితులను విచారించగా అసలు విషయం బయటపడింది.జయలక్ష్మి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాస్పత్రికి తరలించారు. యూనివర్శిటీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ రాయల్‌నగర్‌కు చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రేరణతో మాట్లాడి పరామర్శించారు.నిందితుడు శ్రీనివాస్‌ను పట్టుకోవడం కోసం ఏఎస్పీ కులశేఖర్ ఆధ్వర్యంలో ఐదు బృందాలను ఏర్పాటు చేసి ముమ్మరంగా గాలిస్తున్నారు.



ప్రేరణకు ఎమ్మెల్యే తదితరుల పరామర్శ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

రూ.90 లక్షల మొబైల్ ఫోన్ల రికవరీ



స్వాధీనం చేసుకున్న ఫోన్లను మీడియాకు చూపుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), జూలై 18: మొబైల్ హంట్ అప్లికేషన్ ద్వారా జిల్లాలో దాదాపు 90లక్షల విలువైన 500 మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాకు వివరాలు తెలిపారు. ఏఎస్పీ వెంకట్రావు ఆధ్వర్యంలో మొబైల్ ఫోన్ల చోరీలపై ప్రత్యేక నిఘా పెట్టారు. వాట్సాప్ నెంబరు(94906 17873)కు వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి తొమ్మిదిసార్లు 5.45 కోట్ల విలువైన 3,030 ఫోన్లు రికవరీ చేశారు. తాజాగా మన రాష్ట్రంతోపాటు కేరళ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, కర్ణాటకల నుంచి సైబర్ క్రైమ్ పోలీసులు రికవరీ చేసిన 500 ఫోన్లను బాధితులకు ఎస్పీ అందజేశారు. ప్రజలు తమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వెంటనే మొబైల్ ఫోన్ హంట్ అప్లికేషన్ లేదా సెంట్రల్ ఎక్విప్‌ఎమెంటు ఐడెంటీటీ రిజిస్టర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. అలాగే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకోకుండా ఉద్యోగులు, యువత, మహిళలు, సీనియర్ సిటిజన్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. మొబైల్ ఫోన్ల రికవరీలో ప్రతిభ చూపిన సైబర్ క్రైం సీఐ వినోద్‌కుమార్, సిబ్బందికి రివార్డులు ప్రకటించి.. ప్రశంసా పత్రాలు అందజేశారు.

1 నుంచి హెల్మెట్ ధారణ తప్పనిసరి

- సిద్ధమైన పోలీసు యంత్రాంగం

తిరుపతి(నేరవిభాగం), జూలై 18: హైకోర్టు ఆదేశాల మేరకు ద్విచక్ర వాహనదారులకు ఆగస్టు ఒకటో తేదీ నుంచి హెల్మెట్ ధారణ తప్పనిసరి చేయడానికి జిల్లా పోలీసు యంత్రాంగం సిద్ధమైంది. ఇప్పటికే దీనికి సంబంధించిన బ్యానర్లు, కటౌట్లు, హోర్డింగ్‌లను తిరుపతి, శ్రీకాళహస్తి, నాయుడుపేట, గూడూరు, చంద్రగిరి ప్రాంతాల్లో ఏర్పాటు చేసింది. జిల్లాలో గత ఏడాది జూన్ నుంచి ఈ ఏడాది జూలై పదో తేదీవరకు ద్విచక్ర వాహనాల ద్వారా ప్రమాదాలకు గురైన వారు 1200 మంది ఉన్నారు. వీరిలో 310 మంది ప్రాణాలు కోల్పోగా, దాదాపు 2300 మంది గాయపడ్డారు. వీరిలో ఎక్కువమంది హెల్మెట్ ధరించక పోవడం వల్లే ప్రాణాలు కోల్పోయారు. ముఖ్యంగా యువత ఎక్కువగా రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారు. అందువల్ల హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడిపితే భారీగా జరిమానా విధించేలా చర్యలు తీసుకోనున్నారు.

ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీగా అప్పారావు

మహిళావర్శిటీకి ఉమ, ద్రావిడ వర్సిటీకి దొరస్వామి



సీహెచ్ అప్పారావు - వి.ఉమ - దొరస్వామి - విజయభాస్కరరావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 18: వైసీపీ ప్రభుత్వ హయాంలో నియమితులైన వీసీలు ఇటీవల చేసిన రాజీనామాలకు తాజాగా ప్రభుత్వ ఆమోదం లభించింది. ఈ నేపథ్యంలో ఆయా యూనివర్సిటీలకు ఇన్‌చార్జి వీసీలను నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎస్వీయూకు వర్సిటీలోని బయో కెమిస్ట్రీ విభాగ ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావును నియమించారు. పద్మావతి మహిళా వర్సిటీకి సోషియల్ వర్క్ విభాగ ప్రొఫెసర్ వెన్నం ఉమను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి సౌరబ్ గౌర్ ఉత్తర్వులను జారీ చేశారు. అంటిల్ ఫర్ ద ఆర్డర్ ప్రాతిపదికన వీరిని నియమించారు. వీరిద్దరూ శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.అలాగే నెల్లూరులోని విక్రమసింహపురి యూనివర్సిటీ ఇన్‌చార్జి వీసీగా ఎస్వీయూ ఫిజిక్స్ విభాగ ప్రొఫెసర్ విజయభాస్కరరావు నియమితులయ్యారు.కుప్పంలోని ద్రావిడ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ వీసీగా గ్రంధాలయ శాఖ ఆచార్యుడు ఎం.దొరస్వామి నియమితులయ్యారు.

తిరుపతి ఆర్డీవోను విచారించిన సీఐడీ

రెండు రోజుల్లో సమాచారం ఇవ్వాలంటే వారం వ్యవధి కోరిన ఆర్డీవో నిశాంత్‌రెడ్డి

తిరుపతి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఆర్డీవో నిశాంత్‌రెడ్డిని సీఐడీ అధికారులు గురువారం విచారించారు. తమకు అందిన ఫిర్యాదు మేరకు పలు అంశాలపై సమాచారం కోరారు. కోరిన సమాచారాన్ని రెండు రోజుల్లో ఇవ్వాలని సూచించారు.గురువారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో సీఐడీ డీఎస్పీ పద్మలత, సీఐ రామకిషోర్, ఎస్ఐ మంజుల సిబ్బందితో కలసి ఆర్డీవో కార్యాలయం చేరుకున్నారు. ఆర్డీవో నిశాంత్‌రెడ్డిని ఆయన ఛాంబర్‌లో కలసి పలు అంశాలపై విచారించారు. ఈ సందర్భంగా తమకందిన ఫిర్యాదులో పేర్కొన్న మేరకు చంద్రగిరి నియోజకవర్గ ఓటరు జాబితాలో మార్పు చేర్పులు, తొలగింపులకు సంబంధించి కూడా ప్రశ్నించినట్టు తెలిసింది. అయితే ఓటరు జాబితాలో చేర్పులు, తొలగింపులు వంటివాటితో తనకు ఎలాంటి సంబంధం లేదని ఆర్డీవో చెప్పినట్టు తెలిసింది. అలాంటప్పుడు చంద్రగిరి గత ఎమ్మెల్యే ప్రైవేటు కార్యాలయానికి తరచూ ఎందుకు వెళ్ళాల్సి వచ్చిందని, అక్కడికి నియోజకవర్గంలోని తహసీల్దార్లను ఎందుకు పిలిపించాల్సి వచ్చిందని సీఐడీ అధికారులు ప్రశ్నించినట్టు తెలిసింది. దీనికి ఆర్డీవో తాను ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్ళడంలో తప్పేంవుందని ఎదురు ప్రశ్నించినట్టు సమాచారం. ప్రభుత్వ పనులపై తాను ఎమ్మెల్యేను కలవడం, ఆయన కార్యాలయానికి వెళ్ళడం తప్పెలా అవుతుందని, తహసిల్దార్లను పిలిపించడం కూడా తప్పేమీ కాదని సమాధానమిచ్చినట్టు తెలిసింది. ఓటర్ల జాబితాకు సంబంధించి తనపై వచ్చిన ఆరోపణల్లో నిజం లేదని, తన ప్రమేయం ఏమీ లేదని చెప్పినట్టు తెలిసింది. సుమారు గంట పాటు సీఐడీ అధికారులు ఆర్డీవో ఛాంబర్‌లో గడిపి అవసరమైన సమాచారం సేకరించే ప్రయత్నం చేసి అనంతరం వెనుదిరిగారు.

వెటర్నరీ వర్సిటీలో నిధుల దుర్వినియోగం

- వైసీపీ పాలనలో లాయర్ల ఫీజుకింద రూ.96లక్షల ఖర్చు
- స్టాండింగ్ కౌన్సిల్ ఉన్నా.. అదనపు న్యాయవాదుల నియామకం
- లీగల్ ఖర్చులపై ఎల్‌ఎఫ్ ఆడిట్ అధికారుల అభ్యంతరం



వెటర్నరీవర్సిటీ | పరిపాలనా భవనం

తిరుపతి రూరల్, జూలై 18 : తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో లీగల్ ఖర్చుల కింద గత వైసీపీ పాలనలో ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారన్న విమర్శలు రేగాయి. వర్సిటీ ఉద్యోగుల పదోన్నతులు, బకాయిలు, నిబంధనలు ఉల్లంఘించి చేపట్టిన నియామకాలు తదితర కేసులకోసం ప్రభుత్వ ధనాన్ని న్యాయవాదుల ఫీజు కింద దాదాపు రూ.96లక్షలు ఖర్చు చేసినట్లు సమాచార హక్కు చట్టం కింద అడిగిన ప్రశ్నలకు ఇచ్చిన సమాధానంలో బయటపడింది.హైకోర్టులో వర్సిటీకి సంబంధించి కేసులు వాదించేందుకు 2020-2024సంవత్సరాలకు అప్పటి వైసీపీ ప్రభుత్వం స్టాండింగ్ కౌన్సిల్‌గా కె.రామమోహనరావును నియమించింది. ఈయనకు గౌరవ వేతనంగా నెలకు రూ.20వేలు అందించేలా ఉత్తర్వులు జారీ చేసింది.దీని ప్రకారం ఈయనకు నాలుగేళ్లకు దాదాపు రూ.10లక్షలు గౌరవవేతనం ఇవ్వాల్సివుండగా.. ప్రభుత్వ అనుమతి లేకుండా నియమించిన ఇతర న్యాయవాదులతో కలిపి రూ.96లక్షలు మంజూరు చేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండానే అదనంగా పొన్నవోలు సుధాకర రెడ్డి(ఏఏజీ), వైవీ రవిప్రసాద్, పీవీ సుధాకర్‌రెడ్డి, మధుకర్‌రెడ్డిలను న్యాయవాదులుగా నియమించి వర్సిటీ అధికారులు ప్రభుత్వ ధనాన్ని వృధా చేశారు. దీనికితోడు అప్పట్లో ఏఏజీగా ఉన్న పొన్నవోలు సుధాకర్‌రెడ్డికి కూడా ఫీజు చెల్లించారని, నిబంధనల ప్రకారం ఆయనకు ప్రభుత్వ సంస్థలకు సంబంధించిన కేసులకు ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదంటున్నారు. లోకల్ న్యాయస్థానంలో కూడా ప్రభుత్వం నియమించిన స్టాండింగ్ కౌన్సెల్ వర్సిటీకి సంబంధించిన కేసులను ఎంగేజ్ చేయాల్సి ఉందని,అయితే ప్రభుత్వ అనుమతి లేకుండానే ఇంటర్నల్‌గా వర్సిటీ ఉన్నతాధికారుల అనుమతితో మధుకర్‌రెడ్డి అనే న్యాయవాదిని నియమించి ఫీజు కింద రూ.6,85,200 చెల్లించారు. రెండునెలల కితం వర్సిటీలో నిర్వహించిన లోకల్‌ఫండ్(ఎల్‌ఎఫ్) ఆడిట్ అధికారులు ఈ ఖర్చులపై అభ్యంతరం వ్యక్తం చేశారని సమాచారం. కోర్టును ఆశ్రయించిన ఉద్యోగులతో నేరుగా మాట్లాడి పరిష్కరించుకునే చిన్నచిన్న సమస్యలకు కూడా న్యాయవాదులకు అనవసరంగా ఫీజుకింద డబ్బు చెల్లించారని చెబుతున్నారు.ఈ నాలుగేళ్లలో హైకోర్టులో దాదాపు 60కేసులు, సుప్రీంకోర్టులో 10కేసులు దాఖలు చేయడాన్ని బట్టి ఉద్యోగుల పట్ల వర్శిటీ పాలకులు అనుసరించిన వైఖరి ఏ విధంగా ఉందో స్పష్టమవుతోంది.అలాగే 2016-17లో ఇంటర్నల్ ఆడిట్ రిపోర్ట్ (రాయలసీమ, కోస్టల్ ఆంధ్రా జోన్) ప్రకారం గతంలోనూ అధికారులు చాకచక్యంగా నిధులను దుర్వినియోగం చేశారని.. కాంట్రాక్ట్ ఏజెన్సీలకు బ్యాంకు చెక్కులను సీరియల్‌గా ఇవ్వాల్సిఉండగా మధ్యమధ్యలో తమకు అనుకూలంగా మలచుకుని చెక్కులు అందించారని, మంత్లీ అకౌంట్స్‌లో నగదు లెక్కలు కూడా తారుమారు చేసినట్లు ఇంటర్నల్ ఆడిట్ రిపోర్ట్‌లో నివేదించారని అంటున్నారు. ఆ నిధులు ఏమయ్యాయన్నది ఇంతవరకు తేలలేదంటున్నారు. అప్పట్లో పోస్టల్ స్టాంప్స్‌లోనూ అవకతవకలు చోటుచేసుకున్నాయని, కంపెనీలకు కూడా డబుల్ పేమెంట్ చేశారని కూడా ఆ నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. దీనిపై అప్పటి ఫైనాన్స్ అధికారులపై విచారణ చేసి తగు చర్యలు చేపట్టాలని ఆడిట్ రిపోర్ట్‌లో స్పష్టంగా నివేదించినా ఇప్పటివరకు వారిపై ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం ఉద్యోగుల ఆరోపణలకు బలం చేకూర్చుతోంది. అలాగే 2020-21లో కూడా ఓ అధికారి(రాయలసీమ జోన్) కాంట్రాక్ట్ ఏజెన్సీలకు డబుల్ పేమెంట్ చేశారని, ఈ విషయం వెలుగులోకి వచ్చాక రెండు సంవత్సరాల తర్వాత ఏజెన్సీల నుంచి రికవరీ చేసినట్లు సమాచారం. ఈ అవకతవకలకు కారణమైన వారికి కనీసం మెమో ఇచ్చిన దాఖలాలు కూడా లేకపోవడమేమిటని ఉద్యోగులు నిలదీస్తున్నారు. కాగా వర్సిటీ ప్రధానకేంద్రంగా గతవారంరోజుల నుంచి అకౌంటెంట్ జనరల్ ఆడిట్(ఏజీ) జరుగుతోందని, వీటిపై లోతైన విచారణ చేపడితే నిజాలు వెలుగు చూసే అవకాశం ఉందని ఉద్యోగవర్గాలంటున్నాయి.

టీటీడీ ఇన్‌ఛార్జ్ సీవీఎస్వోగా గౌతమి

తిరుమల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఇన్‌చార్జ్ సీవీఎస్వోగా గౌతమిని నియమించారు. గతంలో సీవీఎస్వోగా ఉన్న నరసింహకిషోర్ బదిలీ అయిన విషయం తెలిసిందే. అయితే ఆ పోస్టుకు ప్రభుత్వం ఎవరిని నియమించలేదు. ఈ క్రమంలో టీటీడీ ఎడ్యుకేషన్, హెల్త్ జేఈవోగా ఉన్న గౌతమికి ఇన్‌చార్జ్ సీవీఎస్వోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రభుత్వం ఆ స్థానంలో మరో ఐపీఎస్ అధికారిని నియమించే వరకు గౌతమి ఇన్‌చార్జ్ సీవీఎస్వో బాధ్యతలను చూడనున్నారు.

జనసేన సభ్యత్వ నమోదు ప్రారంభం

తిరుపతి అర్బన్, జూలై 18: జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం గురువారం ఉదయం స్థానిక ఎన్జీవో కాలనీలోని తన నివాసం వద్ద ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి డివిజన్‌లో ఓ నాయకుడి ఆధ్వర్యంలో ఈనెల 28వ తేదీవరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. డివిజన్‌కు 200మందిని సభ్యులుగా చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. సుమారు పదివేల మందిని చేర్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని స్పష్టం చేశారు. సభ్యత్వం తీసుకున్నవారికి జనసేనాని పవన్‌కల్యాణ్ గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించారని గుర్తు చేశారు. దీనివల్ల అనుకోని దుర్ఘటనల్లో కార్యకర్తలు మృతి చెందితే రూ.5లక్షలు, గాయాలైతే రూ.50వేలను అందజేస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్‌రాయల్, నగరాధ్యక్షుడు రాజారెడ్డి, పి.వినోద్ రాయల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, జనసేన నాయకులు

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

స్టేడియంలో వసతుల కల్పనకు చర్యలు


స్టేడియాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో కిరణ్‌కుమార్

గూడూరు, జూలై 18: స్థానిక ఏపీరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో వాకర్లకు, క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పించాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆదేశాల మేరకు చర్యలు చేపట్టినట్లు ఆర్డీవో కిరణ్‌కుమార్ చెప్పారు. గురువారం ఆయన అధికారులతో కలిసి స్టేడియాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ డ్రైనేజీ సమస్య పరిష్కారం, తాగునీటి వసతి కల్పన, జిమ్‌లో ఆధునిక పరికరాల ఏర్పాటు, ప్రహరీగోడ అభివృద్ధి వంటి అంశాలపై ప్రణాళికలను రూపొందించామన్నారు. త్వరితగతిన పనులు పూర్తిచేస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, తహసీల్దారు కరుణ్‌కుమార్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణకు అవగాహనా ర్యాలీ



ర్యాలీలో అదనపు జిల్లా జడ్జీ షమ్మీపర్వీన్ సుల్తానాబేగం

గూడూరు, జూలై 18: ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జిల్లా ఏడవ అదనపు జడ్జి షమ్మీపర్వీన్ సుల్తానాబేగం అన్నారు. గురువారం స్థానిక కోర్టు నుంచి పాతబస్టాండు వరకు న్యాయశాఖ ఆధ్వర్యంలో హెల్మెట్ వినియోగంపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించకపోవడంతో చాలామంది ప్రాణాలో కోల్పోతున్నారన్నారు. హెల్మెట్ ధరిస్తే రక్షణగా ఉంటుందన్నారు. న్యాయమూర్తులు లోకనాథం, సులోచనారాణి, డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, న్యాయవాదులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాయుడుపేట: హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తూ స్థాని అంబేడ్కర్ భవనం నుండి పాతబస్టాండ్ వరకు గురువారం ర్యాలీ నిర్వహించారు. న్యాయమూర్తులతో కలసి జూనియర్ సివిల్ జడ్జి సంయుక్త ఇందులో పాల్గొన్నారు. పాత బస్టాండ్ వద్ద హెల్మెట్ ధరించడం వలన లభించే ఉపయోగాలను జడ్జి వివరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పసల గంగాప్రసాద్, న్యాయవాదులు పార్థసారథిరెడ్డి, సోమశేఖర్, చదలవాడ కుమార్, చెంగయ్య, దశయ్య, కిషోర్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

కోట: స్థానిక కోర్టు ప్రాంగణం నుంచి నెహ్రూ బొమ్మ వరకు విద్యార్థులు, న్యాయవాదులతో అవగాహన ర్యాలీ జరిగింది. స్థానిక జూనియర్ సివిల్ జడ్జి భరత్ కమల్ పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో సివిల్ జడ్జికోర్టు న్యాయమూర్తి అనిల్ కుమార్ పాల్గొన్నారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేజే ప్రకృతి కుమార్, న్యాయవాదులు సుధాకర్ రెడ్డి, శ్రీరాముల యాదవ్, లక్ష్మయ్య, గణపతి, విజయమ్మ, శ్రీహరికోట ఎస్ఐ రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన బలోపేతానికి కృషి

గూడూరు, జూలై 18: జనసేనపార్టీ బలోపేతానికి కార్యకర్తలంగా కష్టపడి కృషిచేయాలని ఆ పార్టీ నాయకులు మునిగిరీష్, చంద్రనీల్ అన్నారు. గురువారం స్థానిక సనత్‌నగర్ సమీపంలోని పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 28వ తేదీ వరకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. పార్టీకి చెందిన రాజశేఖర్, వెంకటేశ్వర్లు, నయూం, రవిచంద్రబాబు, సూర్య, విష్ణు, అవినాష్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక గమళ్లపాళెంలోని పార్టీ కార్యాలయంలో ఉమ్మడినెల్లూరుజిల్లా జనసేనపార్టీ ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మోహన్, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

గూడూరు అర్బన్, జూలై 18: స్థానిక మధురెడ్డికాలనీలో గురువారం రోటరీ వెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో ఎస్వీరత్నం చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు శ్రీకంటి రామమోహన్‌రావు పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ రోటరీవెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, నాశిన నాగులు, సనత్ కుమార్‌రెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

గూడూరు అర్బన్, జూలై 18: స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీహాలులో గురువారం పెళ్లకూరు చాగణం లలితమ్మ, భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌరీశంకర్ మాట్లాడుతూ తిరుపతికి చెందిన వెంకటేశ్వర అరవింద్ నేత్రాలయ ఆసుపత్రి సహకారంతో డాక్టర్ చాందిని ఆధ్వర్యంలో పేదలకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించామన్నారు. ఉచితంగా మందులు, కంటి అద్దాలను అందజేశామన్నారు. అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేయిస్తామన్నారు. సీతారామానాయుడు, కృష్ణ, దిలీప్ పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

సూళ్లూరుపేట, జూలై 18: అట్టకానితిప్ప మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం ఆచార్య భరద్వాజ సేవాసంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఎంఈవో శీనయ్య నోట్‌బుక్స్, వాటర్ బాటిల్స్‌తో పాటు విద్యా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ఆచార్య భరద్వాస సేవాసంస్థ నిర్వాహకులు ఎంఎం చంద్రబాబు, ఆలపాటి అశోక్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేవతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిసేవలో ఎమ్మెల్యేలు



వెంకటగిరి, జూలై 18 : వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ జన్మదినం సందర్భంగా గురువారం రాత్రి తిరుపతిలో తేనేటి విందుకు హాజరైన సహచర ఎమ్మెల్యేలు శుక్రవారం తిరుమలలో వెంకటేశ్వస్వామిని దర్శించుకున్నారు. స్వామి వారిని దర్శించుకొన్న వారిలో ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, సునీల్, జయశ్రీ, పారిశ్రామికవేత్త కొడేపాటి గంగాప్రసాద్, వారి కుటుంబసభ్యులు ఉన్నారు.

రైలు ఢీ కొని మహిళ మృతి

తడ, జూలై 18 : రైలు ఢీకొని ఓ మహిళ మృతి చెందింది. గురువారం తెల్లవారుజామున తడ రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫారం 1 నుంచి రెండవ ప్లాట్‌ఫారానికి వెళ్లేందుకు సుమారు 55 - 60 మధ్య వయస్సు కలిగిన మహిళ పట్టాలు దాటుతుండగా చెన్నై- హైదరాబాదు ఎక్స్‌ప్రెస్ ఢీకొంది. మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని సీఆర్‌పీ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. మహిళకు సంబంధించి ఎటువంటి ఆధారాలు లభించలేదు. చెన్నైకు చెందిన మహిళగా భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మతి స్థిమితంలేని వ్యక్తి దాడి
● హెడ్‌కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు

గూడూరు, జూలై 18: స్థానిక సాధుపేట సెంటర్‌లో గురువారం హెడ్‌కానిస్టేబుల్‌ను మానసిక పరిస్థితి సరిగాలేని ఓ యువకుడు గాయపరిచాడు. ఒకటో పట్టణ పోలీసుల కథనం మేరకు.... స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ స్వామిదాసు, మరో కానిస్టేబుల్‌తో కలిసి టీ తాగేందుకు సాధుపేట సెంటర్‌లోని టీ దుకాణంలోకి వెళ్లాడు. అదే సమయంలో వెనుక నుంచి వెస్ట్‌బెంగాల్‌కు చెందిన లల్‌టు కాలిండి అనే మానసికస్థితి సరిగాలేని ఓ యువకుడు వచ్చి కర్రతో స్వామిదాసు తలపై కొట్టాడు. తీవ్ర గాయాలపాలైన హెడ్ కానిస్టేబుల్‌ను నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. నిందితుడుని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు. ఒకటో పట్టణ సీఐ పాపారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉరి వేసుకొని వృద్ధురాలి ఆత్మహత్య


పెళ్లకూరు, జూలై 18 : శిరసనంబేడు రాజుపాలెం గ్రామానికి చెందిన దొమ్మరాజు నరసమ్మ (65) గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ శ్రీకాంత్ కథనం మేరకు వివరాలిలా.. షుగర్, బీపీతో పాటు స్వల్ప మానసిక రుగ్మతలతో బాధపడుతున్న నరసమ్మ ఈ నెల 2న ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. కుటుంబసభ్యులు అన్ని ప్రాంతాలలో గాలించి విఫలమై పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం అటవీ ప్రాంతంలోకి వెళ్లిన పశువుల కాపరులకు నరసమ్మ మృతదేహం చెట్టుకు వేలాడుతూ ఉండటాన్ని గుర్తించారు. వారు పోలీసులకు ఈ విషయం తెలియజేశారు. పోలీసులు వెళ్లి మృతదేహాన్ని కిందకు దించారు. ఆమె ఉరివేసుకుని మృతి చెంది ఎక్కువ రోజులు కావడంతో సంఘటనా స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

రెండు మోటారు సైకిళ్ల ఢీ
● ఒకరు మృతి - ముగ్గురికి తీవ్ర గాయాలు


మృతి చెందిన రామాంజనేయులు

నాయుడుపేట టౌన్, జూలై 18 : నాయుడుపేట - మేనకూరు సెజ్ సమీపంలో రెండు మోటారు సైకిళ్ల ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందారు. ముగ్గురు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు మేనకూరు సెజ్‌లోని వివిధ కర్మాగారాలలో గురువారం రాత్రి విధులు నిర్వహించుకొని అశోక్, తేజా ఒక మోటారు సైకిల్, మరో మోటారు సైకిల్‌పై రామాంజనేయులు, హేమచంద్రలు బయలుదేరారు. ఈ రెండు మోటారు సైకిళ్లు ఎదురెదురుగా ఢీ కొనడంతో ప్రమాదం జరిగిది. గాయపడిన అశోక్, తేజాను ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రామాంజనేయులు, హేమచంద్రలను పట్టణంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ రామాంజనేయులు (25) మృతి చెందాడు. అశోక్, తేజా, హేమచంద్రలను మెరుగైన వైద్యసేవల కోసం నెల్లూరు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సర్ఫేస్ చెక్‌డ్యాంలతో వృథా జలాలకు చెక్
● కార్యరూపం దాల్చని ప్రతిపాదనలు


స్వర్ణముఖిలో జలకళ (ఫైల్‌ఫొటో)

నాయుడుపేట, జూలై 18: స్వర్ణముఖి నదీ జలాలు వృథా కాకుండా ప్రతిపాదించిన సర్ఫేస్ డ్యాంల నిర్మాణం నేటికీ కార్యరూపం దాల్చలేదు. ఈ నది వేలాది ఎకరాలకు సాగునీరు అందిస్తూ పరివాహక ప్రాంతాల దాహార్తిని కూడా తీరుస్తోంది. 155 కిలోమీటర్ల మేర ప్రవహించి సముద్రంలో కలుస్తుంది. వర్షాకాలంలో నదిలో దాదాపు 1.58 లక్షల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుంది. చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాల నడుమ దాదాపు 44 చెరువులకు నీరందిస్తుంది. సుమారు 36వేల ఎకరాలకు సాగునీరందుతోంది. దోసిళ్లవంక బియానది, రాళ్ళవంక, కల్యాణ్‌నది, నాగతీరువంక, మామిడికాలువలు నదిలో కలుస్తున్నాయి. స్వర్ణముఖి జలాలు వృథా కాకుండా నాటి సీఎం నేదురుమల్లి కాలంనాటి నుంచి జిల్లాలో పలుచోట్ల సర్ఫేస్ డ్యాంలు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. 2009లో పెళ్లకూరు నుంచి గునపాటిపాళెం వరకు ప్రాంతాల్లో సర్ఫేస్ డ్యాంల నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరయ్యాయి. ఎన్నికల కోడ్‌తో పనులు జరగక నిధులు వెనక్కుమళ్లాయి. తరువాత వాకాడు వద్ద బ్యారేజీ నిర్మించడంతో చెక్‌డ్యాంల నిర్మాణానికి అనుమతులు లభించలేదు. ప్రత్యామ్నాయంగా సర్ఫేస్ డ్యాంల నిర్మాణాల కోసం గత వైసీపీ ప్రభుత్వంలో అంచనా వేసి అనుమతికి ప్రతిపాదనలు పంపినా పాలకులు పట్టించుకోలేదు. సర్ఫేస్ డ్యాంల ద్వారా ఆయా ప్రాంతాల్లో భూగర్భ జలాల మట్టం పెరగడంతో సాగు, తాగునీటికి ఇబ్బందులు ఉండవు.

నీటి పథకాలకు మంగళం...

పెళ్లకూరు, నాయుడుపేట, చిట్టమూరు, వాకాడు మండలాలకు స్వర్ణముఖి నుంచే రాజీవ్ టెక్నాలజీ పథకాల ద్వారా తాగునీరు అందుతోంది. ఎండాకాలం వస్తే తాగునీరు అందించడానికి నానాఅవస్థలు పడాల్సి వస్తుంది. గత ప్రభుత్వ హయాంలో ఇష్టారాజ్యంగా ఇసుక తోడేయడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. గుక్కెడునీరు అందని దుస్థితి నెలకొంది. సర్ఫేస్ డ్యాంలు నిర్మిస్తే ఇసుక అక్రమ తరలింపునకు అడ్డుకట్ట పడటమే కాకుండా భూగర్భజలాల పెరిగేందుకు వీలుపడుతుంది


రాళ్ల గుట్టలతో స్వర్ణముఖి

వైసీపీ అక్రమాలపై శ్వేతపత్రం విడుదల: టీడీపీ


సమావేశంలో టీడీపీ నాయకులు

గూడూరు అర్బన్, జూలై 18: వైసీపీ పాలనలో జరిగిన అక్రమాలు, దోపిడీలపై రాష్ట్ర ప్రభుత్వం త్వరలో శ్వేతపత్రాన్ని విడుదల చేస్తుందని టీడీపీ పట్టణ అధ్యక్షుడు పులిమి శ్రీనివాసులు చెప్పారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఏవిధంగా అక్రమాలకు పాల్పడ్డారో, దందాలు చేశారో, ఎంత దోచుకున్నారో ప్రజలకు అర్థమయ్యేలా ఆధారాలతో సహా శ్వేతపత్రాలను విడుదల చేస్తామన్నారు. పార్టీ నాయకులు అబ్దుల్ రహీం, ఇశ్రాయిల్‌కుమార్, రవీంద్రరెడ్డి, శ్రీనివాసులు, పెంచలయ్య, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఆర్వో సిస్టమ్ వితరణ



చిల్లకూరు, జూలై 18: లక్ష్యాలను ఎంచుకుని సాధించుకునేందుకు కష్టపడి చదవాలని రోటరీక్లబ్ అధ్యక్షుడు బీవీ శ్రీధర్‌రెడ్డి విద్యార్థులకు హితబోధ చేశారు. మునిరామయ్య జ్ఞాపకార్థం మునిగిరీష్, మునిభాస్కర్ దాతృత్వంతో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలకు ఆర్వో సిస్టమ్‌ను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల ప్రోత్సాహాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత చదువులు చదవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం జాన్ పీటర్, రోటరీ సభ్యులు దశరథరామిరెడ్డి, మునిగిరీష్, మునిభాస్కర్, రఘురామిరెడ్డి, పీవీకృష్ణయ్య, జీజీ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నేడు చిల్లకూరులో రొట్టెల పండుగ


ముస్తాబవుతున్న దోషా దర్గా

చిల్లకూరు, జూలై 18: స్థానిక దోషా దర్గాలో శుక్రవారం రొట్టెల పండుగ నిర్వహించనున్నట్లు ముతవల్లి జుబేర్‌బాషా తెలిపారు. నెల్లూరు రొట్టెల పండుగ సమయంలో మూడో రోజున దోషా దర్గాలో ఈ వేడుక జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని ఆయన గురువారం చెప్పారు. కులమతాలకు అతీతంగా వైభవంగా జరుపుకొనే ఈ పండుగకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలూ కల్పిస్తున్నామన్నారు.

తరగతి గది పరిశీలనపై శిక్షణా తరగతులు

నాయుడుపేట, జూలై 18 : ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి గది పరిశీలనపై 9 రోజులపాటు జరగనున్న శిక్షణా తరగతులను నాయుడుపేట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర పరిశీలకులు అపర్ణ అన్నారు. నాయుడుపేట, దొరవారిసత్రం, సూళ్లూరుపేట, తడ, చిట్టమూరు, కోట, వాకాడు, ఓజిలి, చిల్లకూరు, గూడూరు పది మండలాలలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్య, సరళీకృత బోధనలపై శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అకడమిక్ మానిటరింగ్ అధికారి శివశంకర్, కోర్స్ డైరెక్టర్ శాంతి, నోడల్ అధికారి బి. మునిరత్నం, రిసోర్స్ పర్సన్స్ మహేష్, రాజు, రమణయ్య, మధుకర్, ప్రదీప్, వెంకటరమణయ్య తదితరులు ఉన్నారు.

అధికారులపై బ్లాక్ మెయిల్ మానుకో
● మాజీ ఎమ్మెల్యే కిలివేటిపై నెలవల ధ్వజం


మాట్లాడుతున్న మాజీ ఎంపీ నెలవల, టీడీపీ నేతలు

సూళ్లూరుపేట, జూలై 18: నిక్కచ్చిగా విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ పై ఆరోపణలు చేయడం మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు తగదని మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం అన్నారు. గురువారం ఆయన టీడీపీ నేతలతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. మంచి పనులు చేసే అధికారులను అభినందించాల్సిందిపోయి దాదాగిరి చేయడం ఏమిటని ప్రశ్నించారు. తహశీల్దార్ కార్యాలయ ఆవరణ పక్కన ఎంపీడీవో కార్యాలయానికి రక్షణ గోడ నిర్మిస్తే రాజకీయం చేయడం సరికాదన్నారు. దక్షిణవైపు గోడ కడితే అభ్యంతరమేమిటన్నారు. కార్యాలయానికి రక్షణ లేకుండా నాలుగు వైపులా గోడకూలి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే తహసీల్దార్ ప్రహరీ కడితే లేనిపోని ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. పొరపాటు జరిగితూ నేరుగా అధికారి వద్దకు వెళ్లి మాట్లాడాలే తప్ప మందీ మార్బలంతో కార్యాలయ ఆవరణలో దాదారిగి చేయడం తగదన్నారు. పద్ధతి మార్చుకోవాలని ఎంపీడీవోకు కూడా ఆయన హితవు పలికారు. ఎంపీడీవో తీరును కలెక్టర్, జడ్పీ సీఈవో దృష్టికి తీసుకెళ్లనున్నట్లు నెలవల పేర్కొన్నారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శిలు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, తెలుగు యువత ఉపాధ్యక్షుడు మాధవనాయుడు, గాడి నారాయణ రెడ్డి, కొక్కు శంకరయ్య, వేనాటి మురళి రెడ్డి, రాజసులోచనమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌ల ఏర్పాటుపై అధికారుల పరిశీలన

కోట, జూలై 18 : స్వర్ణముఖి, చల్లకాలువల నదులలో ఉచిత ఇసుకరీచ్‌ల ఏర్పాటుపై అధికారులు గురువారం పరిశీలించారు. తహసీల్దారు నాగరాజరావు ఆధ్వర్యంలో ఇరిగేషన్, మైనింగ్ అధికారులు గూడలి,గూడలి బిట్-1, గూడలి బిట్-2, పుచ్చలపల్లి, నెల్లూరుపల్లి కొత్తపాళెం తదితర ప్రాంతాల్లో పరిశీలించారు. అనువైన రీచ్‌లను గుర్తించి కలెక్టర్‌కు నివేదిస్తామని తహసీల్దారు తెలిపారు.

కట్టువాపల్లిలో ఉచితంగా మినరల్ వాటర్ సరఫరా


మాట్లాడుతున్న మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం

దొరవారిసత్రం, జూలై 18 : కట్టువాపల్లి పంచాయతీలోని ప్రతి ఇంటికీ ఉచిత మినరల్ వాటర్ అందజేయనున్నట్లు మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం చెప్పారు. కట్టువాపల్లిలో గున్నం సేవాట్రస్టు అధినేత గున్నం మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన గురువారం జరిగిన కార్యక్రమంలో తెలిపారు. ఎన్నికల హామీ మేరాకు మినరల్ వాటర్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేమసాని శ్రీనివాసులునాయుడు, దుర్గాప్రసాద్‌నాయుడు, భాస్కర్‌నాయుడు, పెళ్లకూరు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా గురుపూర్ణిమ మహోత్సవాలు ప్రారంభం


విశేష అలంకరణలో షిరిడీ సాయిబాబా

నాయుడుపేట, జూలై 18 : నాయుడుపేట బ్రాహ్మణవీధిలోని షిరిడీసాయిబాబా మందిరంలో గురువారం వార్షికోత్సవ గురు పూర్ణిమ వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. సాయిబాబాకు విశేష పుష్పాలంకరణ, అభిషేకాలు, ప్రత్యేక పూజలు, భక్తులకు ప్రసాదాలు అందజేశారు. శుక్రవారం విశేష పుష్పలంకరణ, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. శనివారం విశేష పుష్పాలంకరణ, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేస్తారు. 21న కాగడ హారతి, విశేష పుష్పాలంకరణ అభిషేకాలు, అర్చన, సామూహిక సాయి సహస్ర నామపూజలు, అన్నదాన ప్రసాదాలు, రాత్రి శ్రీసాయినాధుని నగరోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త కోటూరు సాయిరాం ప్రసాద్ తెలిపారు.

టీడీపీ నేత జన్మదిన వేడుకలు

పెళ్లకూరు, జూలై 18 : టీడీపీ నాయకుడు, సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బంగారంపేట సర్పంచు దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం నిర్వహించారు. సూళ్లూరుపేట టీడీపీ ఇంచార్జీ, మాజీఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నాయకులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు పేరం రమేష్‌నాయుడు, తదితరులు ఉన్నారు.

ఎస్వీయూ రిజిస్ట్రార్‌కు అభినందనలు

నాయుడుపేట, జూలై 10 : వెంకటేశ్వర యూనివర్శిటీ రిజిస్ట్రార్ చంద్రయ్యను గురువారం ఉమ్మడి నెల్లూరుజిల్లా పార్లమెంట్ తెలుగు టీడీపీ మహిళ అధ్యక్షురాలు పనబాక భూలక్ష్మి మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. ఆమె వెంట టీడీపీ నాయకులు గంగాధరయ్య, గంగబాబు, ముబారక్ ఉన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

తడ, జూలై 18 : ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఈవోపీఆర్‌డీ విజయకుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా కొనసాగిన మురళీకృష్ణ సెలవులో ఉండటంతో ఆయన స్థానంలో విజయకుమార్‌ను జిల్లా అధికారులు నియమించారు. ఆయన్ను పంచాయతీ కార్యదర్శులు గాబ్రియల్, మస్తాన్, శ్రీనివాసరావు, ఐకేపీ ఏపీఎం రాజారెడ్డి తదితరులు సత్కరించారు.

గుప్త నిధుల ముఠా అరెస్టు

తవణంపల్లె, జూలై 18: గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టిన ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. మండలంలోని గాజులపల్లె సమీపంలోని పూర్ణచంద్రారెడ్డి మామిడి తోటలో బుధవారం రాత్రి నెల్లూరు జిల్లా వెంకటగిరికి చెందిన బిట్రగుంట దానయ్య(53), కంచరాల శ్రీనివాసులు(55), శశికుమార్(52), శ్రీకాళహస్తి చెంచులక్ష్మీ కాలనీకి చెందిన వేలు(44), రమేష్‌చంద్రన్(44), వెంకటరమణయ్య(65) తవ్వకాలు చేపట్టారు. నిధులు దొరక్కపోవడంతో వెనుతిరిగి వెళుతున్నారనే సమాచారంతో ఆరుగురిని పోలీసులు అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

పేట గురుకులంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు

నాయుడుపేట, జూలై 18 : నాయుడుపేట ఎల్‌ఏ సాగరం బాలుర గురుకుల విద్యార్థులు ఇటీవల అస్వస్థతకు గురైన నేపథ్యంలో పారిశుధ్య పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మున్సిపల్ కమిషనర్ పాఠశాల ప్రాంగణంలో గురువారం కూడా కొనసాగించారు. సామాజిక ఆరోగ్యకేంద్రంలో ప్రస్తుతం ముగ్గురు విద్యార్థులు చికిత్స పొందుతున్నారు.

నేటి మండల సమావేశానికి ఎమ్మెల్యే రామకృష్ణ

డక్కిలి, జూలై 18 డక్కిలి మండల సర్వసభ్య సమావేశం శనివారం జరగనుంది. దీనికి ఎమ్మెల్యే రామకృష్ణ హాజరు కానున్నారు. ఇందుకోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సమావేశానంతరం ఎమ్మెల్యే శాఖల వారీగా చర్చించనున్నారు.

వేనాడులో అల్లాతాత దర్గాకు భక్తుల రద్దీ

తడ, జూలై 18 : వేనాడులోని దావూద్‌షావలి అల్లాతాత దర్గాకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. నెల్లూరులో రొట్టెల పండుగ జరుగుతున్న దృష్ట్యా వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు అక్కడ నుంచి నేరుగా వేనాడు దావూద్‌షావలి దర్గాను దర్శించుకొని వెళ్తుంటారు.ఈ క్రమంలో కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి భక్తులు బాబాను దర్శించుకున్నారు.

నిత్యావసర సరుకుల దుకాణం ప్రారంభం

బాలయపల్లి, జూలై 18 : బాలయపల్లిలో గురువారం ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే నిత్యావసర సరుకులు అందించే దుకాణాన్ని గురువారం టీడీపీ నాయకులు, రెవెన్యూ అధికారులు ప్రారంభించారు. దుకాణదారుల మద్దతుతో దీనిని ఇక్కడ ఏర్పాటు చేశారు.

కోట: కోట బజారుసెంటర్‌లో నిర్ణీత ధరలకు విక్రయించేలా నిత్యావసర సరుకుల దుకాణాన్ని అధికారులు గురువారం ప్రారంభించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం సరుకులు అందజేస్తారు.

గుడి భూమి కబ్జాదారుడి దౌర్జన్యంపై ఫిర్యాదు

డక్కిలి, జూలై 18 : కుప్పాయపాళెం సర్వేనెంబరు 77, 42లోని ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయనీయకుండా కబ్జాదారులు శుక్రవారం అడ్డుకొన్నారు. దీంతో తహసిల్దార్ శ్రీనివాసులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి తిరునాళ్ళ సమయంలో సదరు స్థలాన్ని దేవస్థానం వాడుకునేలా గ్రామస్థులు గతంలో తీర్మానించారు. ఇటీవల ఆ స్థలాన్ని కొందరు కబ్జా చేశారు. దీంతో ఆ స్థలంలో వీఆర్‌ఏ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తుంటే దేవునివెల్లంపల్లికి చెందిన కోళ్ళూరు శ్రీనివాసులు నాయుడు అడ్డుకున్నారు. అతనిపై తహసీల్దార్ ఫిర్యాదుచేశారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరి అరెస్టు

తడ, జూలై 18 : హత్యాయత్నంకు పాల్పడ్డ ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. కాకినాడ జిల్లా తునికి చెందిన సతీష్‌కుమార్ శ్రీసిటీలోని పనిచేస్తున్నాడు. మంగళవారం ఇతనిపై దాడి జరిగింది. ఈ కేసులో రవీంద్రబాబు, దుర్గాప్రసాద్‌లను పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింట్ M/s. Shriram Finance Ltd., Gudur బ్రాంచి [illegible]

SCHEDULE

[illegible]

P.Bhaskar Rao, B.Sc., B.L., Advocate, 13/26, Kummari Street, Gudur